సాక్షి 24|7
పశ్చిమగోదావరి
బుధవారం 30-8-2017

ఉప్పొంగిన కొండ వాగులు
2లో


వర్షాలకు పొంగి ప్రవహిస్తున్న కొత్తూరు కాలువ

- అవివాహితలకు పెళ్లయినట్లు రికార్డులు
- నాన్‌రెసిడెన్షియల్ జాబితాలో స్థానికులు
- ఆర్‌అండ్‌ఆర్ జాబితా గందరగోళం
- అధికారుల అడ్డగోలు ఎంట్రీలు
- పోలవరం నిర్వాసితుల్లో అలజడి



రేపాకగొమ్ము పంచాయతీ కార్యాలయంలో ఇళ్ల జాబితాను పరిశీలిస్తున్న నిర్వాసితులు

ముంచేశారు..

నిర్వాసితులను ముంచేశారు. పోలవరం ప్రాజెక్టు పరిహారం విషయంలోనే కాకుండా ఆర్ అండ్ ఆర్‌లో కూడా నిర్వాసితులకు అన్యాయం జరిగింది. అధికారులు తీసుకున్న అడ్డగోలు నిర్ణయాలు వారి పట్ల శాపంగా మారుతున్నాయి. భూసేకరణ జరిగిన ప్రాంతంలో పుట్టి పెరిగి ఉద్యోగ రీత్యా బయటకు వెళ్లిన వారిని సైతం స్థానికులుగానే గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నా వాటన్నిటినీ తోసి రాజన్నారు. తమను మేనేజ్ చేసిన వారిని లోకల్‌గా, మిగిలిన వారిని నాన్‌లోకల్‌గా గుర్తించి పెద్దస్థాయిలో అక్రమాలకు తెరలేపారు.

2లో

నిర్వాసితులారా స్పందించండి

మీకు సాక్షి తోడుగా

ప్రభుత్వ తీరుతో పోలవరం నిర్వాసితులు నష్టపోతున్నారు. నిర్వాసితులకు పరిహారం పరిహాసంగా మారుతోంది. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ విషయంలోనూ నిర్వాసితులు తీవ్రంగా నష్టపోతున్నారు. బ్రోకర్ల ద్వారా అధికారులు దందాలు చేయడంతో నిర్వాసితులు బాధితులుగా మారిపోతున్నారు. వ్యక్తిగత పరిహారం విషయంలో స్థానికులను స్థానికేతరులుగా చూపడం, పెళ్లి కాని వారిని పెళ్లి అయినట్లుగా చూపించి వారికి పరిహారం అందకుండా చేశారు. పంటలకు ఇచ్చే నష్టపరిహారం కూడా దారి మళ్లింది. ఈ నేపథ్యంలో బాధితుల గాథలను వెలుగులోకి తీసుకువచ్చి వారికి అండగా నిలబడాలని 'సాక్షి' నిర్ణయించింది. మీరు చేయాల్సిందల్లా.. మీకు జరిగిన నష్టాన్ని మా దృష్టికి తీసుకురావడమే..మీ వద్ద ఉన్న ఆధారాలను, ఏ విధంగా మీరు నష్టపోయారనే విషయాన్ని 'సాక్షి' ద్వారా అధికారుల దృష్టికి తీసుకువెళతాం.

కాల్ చేయాల్సిన ఫోన్ నెంబర్లు
9912199661, 9441170751


జంగారెడ్డిగూడెం జేపీ సెంటర్‌లో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే రోజాను కించపరుస్తూ ఫ్లెక్సీ ఏర్పాటుచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న ఆ పార్టీ నాయకులు, శ్రేణులు

వార్త మెయిన్‌లో

అన్నదాతకు యాప్ అండ




- 'ప్లాంటిక్స్'తో రైతులకు మేలు
- తెగుళ్లు, నివారణ సూచనలు వెంటనే
- తెలుగులోనూ సమాచారం
- సహకారం అందిస్తున్న ఇక్రిశాట్

ఏలూరు (మెట్రో) :

మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పంటకు తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. రైతు వెచ్చించే ఖర్చులో పురుగు మందులదే సింహ భాగం. పంటలో తెగులు కనిపిస్తే చాలు ఏ మందులు పిచికారీ చేయాలో అర్థంకాక అన్నదాతలు ఆందోళన చెందుతుంటారు. దీంతో పంటలు

మిగతా 2వ పేజీలో ▶

ఈ విధంగా మొబైల్ ద్వారా ఫొటోలు తీసి పైర్లపై తెగుళ్ల వివరాలు తెలుసుకోవచ్చు





ఉప్పొంగిన కొండ వాగులు

- ఇసుక కాల్వకు గండి
- ముంపునకు గురైన పంటచేలు
- పొంగిపొరుతున్న కొత్తూరు కాల్వ
- ఏజెన్సీలో రాకపోకలకు అంతరాయం



ఇసుక కాలువ గండిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ముక్కంటి

పోలవరంలో ఇసుక కాలువకు గండి పడిన దృశ్యం

పోలవరం : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పోలవరం ప్రాంతంలో కొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షపాతం 77.8 మిల్లీమీటర్లుగా నమోదు అయ్యింది. కొత్తూరు, కొవ్వాడ, ఇసుక కాలువ, పేడ్రాల, నక్కలగొయ్యి కాలువలు ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్నాయి. కొత్తూరు కాలువ ఉధృతంగా ప్రవహించటంతో తెల్లవారు జాము నుంచి మధ్యాహ్నం వరకు ఏజన్సీ గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగు దాటేందుకు ఏజన్సీ వాసులు గంటల తరబడి ఎదురు చూడాల్సి వచ్చింది. కొత్తరామయ్యపేట పునరావాస కేంద్రం సమీపంలో ఇసుక కాలువ కుడి గట్టుకు 15 నుంచి 20 మీటర్ల పొడవున గండి పడింది. దీంతో పంట చేలు ముంపునకు గురయ్యాయి. కొంతమేరకు పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఇసుక కాలువకు గండి పడటంతో రామయ్యపేట వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారు. కాలువ నీరు గ్రామంపైకి వస్తుందని భయపడ్డారు. పేడ్రాల, నక్కలగొయ్యి, కొవ్వాడ కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇసుక కాలువ గండిని పోలవరం తహసీల్దార్ ఎం.ముక్కంటి, ఆర్ఐ ఆర్.నాగరాజు పరిశీలించారు. గండిని తాత్కాలికంగా పూడ్చి వేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు తహసీల్దార్ తెలిపారు.

ముంచేశారు..

సాక్షి ప్రతినిధి, ఏలూరు, వేలేరుపాడు :

పోలవరం నిర్వాసితులకు వ్యక్తిగత పరిహారం జాబితాను మంగళవారం ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పెట్టింది. దీన్ని చూసిన వారు గగ్గోలు పెడుతున్నారు. పోలవరం నిర్వాసితుల ఇండ్ల పరిహారం ప్యాకేజీ జాబితా అంతా గజిబిజి గందరగోళంగా ఉంది. వ్యక్తిగత పరిహారం జాబితాను ప్రకటించిన అధికారులు ఇండ్ల (ఇంటి విలువ) పరిహారం ప్రకటించలేదు. ఈ జాబితాలో కొంతమంది స్థానికులకు రేషన్ కార్డులు, ఓటరు గుర్తింపు కార్డులు అన్ని ధ్రువపత్రాలు ఉన్నప్పటికీ, నాన్‌రెసిడెన్షియల్‌గా ప్రకటించారు. మరి కొంతమంది యువతులకు అసలు పెళ్లిళ్లు కానప్పటికీ, పెళ్లిళ్లు అయినట్లు (మ్యారీడ్)గా ప్రకటించారు. అన్ని ఆధారాలు ఉన్నా పెద్ద సంఖ్యలో స్థానిక నిర్వాసితుల పేర్లు మాత్రం గల్లంతయ్యాయి. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 29,545 కుటుంబాలు తమ ఇళ్లు కోల్పోతున్నాయి. ఇందులో పదివేల గిరిజన కుటుంబాలుండగా, మిగిలిన 19,545 గిరిజనేతర నిర్వాసిత కుటుంబాలు. అయితే పది నెలల క్రితం సర్వే చేసిన అధికారులు నిర్వాసితులు నివాసముండే పూరిపాకలు, పెంకుటిళ్లు, ఆర్‌సీసీ స్లాబ్ బిల్డింగ్‌లు, రేకులున్న ఇండ్లు, ఇవే కాకుండా 35 ఏళ్ల క్రితం నిర్మించిన మద్రాసు టెర్రర్స్ ఇండ్లు (టేకు కమ్మెలపై స్లాబ్ వేసిన ఇండ్లు) నమోదు చేసారు. ఇంటి పొడవు, వెడల్పులకు మాత్రమే కొలతలు తీసుకున్నారు. అప్పట్లో ఇళ్ల విలువను అధికారులు వెల్లడించలేదు. ఇంటి విలువ వేయాల్సిన ఆర్ అండ్‌బీ అధికారులు కూడా ఈ ఇళ్లను అసలు పరిశీలించలేదు. ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు బోర్‌లను పరిశీలించలేదు. ఫారెస్ట్, హార్టికల్చర్ అధికారులు ఏ ఒక్కరు రాలేదు. అయినా అప్పట్లో తక్కువ ఇంటి విలువలతో కూడిన జాబితా ప్రకటించారు. జూన్ 12వ తేదీన గ్రామసభలు నిర్వహించి 3,430మందిని నకిలీలుగా గుర్తించారు. అదే సమయంలో 26,115మందిని అర్హులుగా ప్రకటించారు. అభ్యంతరాలు స్వీకరించారు. ఆ తర్వాత మళ్లీ తాజాగా ఇంటి స్థిరాస్తి విలువలు లేకుండా కేవలం వ్యక్తిగత ప్యాకేజీ మాత్రమే ప్రకటించారు. దీని వల్ల అనేక మంది నిర్వాసితుల్లో ఆందోళన వ్యక్తమౌతోంది. జగన్నాథపురం గ్రామానికి చెందిన ముతిక ముత్తేశ్వరి భర్త అప్పారావు అనారోగ్యంతో మూడేళ్ల క్రితం మృతి చెందాడు. ఈమెకు ఇద్దరు కుమార్తెలు. భర్త మృతి చెందినప్పటి నుంచి అక్కడే కిరాణా షాపు నడుపుకుంటూ జీవిస్తోంది. అమెను స్థానికేతరురాలిగా ప్రకటించారు. ఈమె బతుకుబండి భారంగా లాగిస్తోంది. స్థానికంగా అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ ఈమె కుటుంబాన్ని నాన్‌రెసిడెన్స్‌గా ప్రకటించారు.



బోరుమంటున్న ముతిక ముత్తేశ్వరి కుటుంబం

అర్హులకు చెయ్యిచ్చారు...

ఈ రెండు మండలాల్లో అనేక మంది స్థానికుల పేర్ల ఎదురుగా జాబితాలో నష్టపరిహారం సున్నాగా చూపించారు. గతంలో అర్హులుగా ప్రకటించిన స్థానికుల పేర్లు ప్రస్తుత జాబితాలో అనర్హులుగా వచ్చాయి. గతంలో అనర్హులుగా ప్రకటించిన స్థానికేతరుల పేర్లు అర్హులుగా వచ్చాయి. దీని వెనుక భారీ కుంభకోణం ఉందని బాధితులు ఆరోపిస్తున్నారు.

కానోళ్లకు పెళ్లిళ్లు చేశారు...

ఆర్ అండ్ ఆర్ నిబంధనల ప్రకారం 18 ఏళ్లు నిండిన యువతులకు పెళ్లి కాకుంటేనే వ్యక్తిగత ప్యాకేజీ పొందే అవకాశం ఉంది. వేలేరుపాడు మండల కేంద్రంలో, జగన్నాథపురం, పాతపూచిరాల, రుద్రమకోట ఇంకా అనేక గ్రామాల్లో 18 నుంచి 20 ఏళ్ల యువతులకు పెళ్లిళ్లు కానప్పటికీ అయినట్లు జాబితాలో ప్రకటించారు. అలాగే గతంలో పెళ్లిళ్లు అయిన వాళ్ల పేర్లు మాత్రం పెళ్లి కానట్లు ప్రస్తుత జాబితాలో చూపించారు. ఫలితంగా వాస్తవంగా పెళ్లికాని యువతులు వ్యక్తిగత ప్యాకేజీ కోల్పోయే పరిస్థితి నెలకొంది.

40 ఏళ్లుగా ఉంటున్నా నాన్‌లోకల్‌గా ప్రకటించారు



నేను నా కుటుంబం నలభై ఏళ్ళుగా వేలేరుపాడులో స్థిర నివాసముంటున్నాం. నాకు రేషన్ కార్డు, అన్ని ఆధారాలు ఉన్నాయి. కానీ జాబితాలో నాన్‌రెసిడెన్స్‌గా చూపించారు. నాకు నలుగురు అమ్మాయిలు. ఇందులో ఇద్దరికి పెళ్లిళ్లు చేసాను. ఇద్దరికి ఇంకా పెళ్లి చేయకుండానే వారిని వివాహితలుగా ప్రకటించారు. ఇది అన్యాయం.

– అఫ్జల్ పాష, వేలేరుపాడు

అందరికీ న్యాయం చేస్తాం:

అర్హులకు ఎవరికీ అన్యాయం జరగదు. అందరికీ న్యాయం జరిగేలా చూస్తాం. నకిలీ ధ్రువపత్రాలతో ప్యాకేజీ పొందాలని చూస్తే అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. – పి కోటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్

అన్నదాతకు యాప్ అండ

▶ మొదటి పేజీ తరువాయి

పరిశీలించకుండానే వ్యాపారులు చెప్పిందే వేదంగా రైతులు పురుగుమందులు వాడేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు వచ్చి పంటను పరిశీలించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇలాంటి దీర్ఘకాలికంగా ఉన్న ఇబ్బందులు తీర్చేందుకు ప్రత్యేకంగా తెగుళ్ల నివారణలు సూచించేందుకు మొబైల్ యాప్‌ను ఇటీవల రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్లాంటిక్స్ (పిఎల్ఎఎన్‌టిఐఎక్స్) అనే ఈ యాప్ ద్వారా రైతులకు ఎంతగానో ఉపయోగపడనుంది.

మారుతున్న ఆధునిక ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రస్తుతం ప్రతి ఒక్కరి దగ్గర ఆండ్రాయిడ్ ఫోన్లు అందుబాటులో ఉంటున్నాయి. ఓ ప్రయివేటు మొబైల్ కంపెనీ సర్వే ప్రకారం ప్రస్తుతం 80 శాతం మంది రైతుల వద్ద స్మార్ట్‌ఫోన్లు ఉన్నాయి. ఇలాంటి వారికి ఈ నూతన యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇప్పటికే లక్ష మందికి పైగా ఈ యాప్‌ను ఉపయోగించుకుని తెగుళ్ల సమాచారాన్ని గుర్తించగలుగుతున్నారని వ్యవసాయాధికారులు అంచనా. ఈ యాప్ జర్మనీ శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఇది అక్కడ ఫలితాలు సాధించడంతో మన దేశంలోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ఇక్రిశాట్ అధికారులు జర్మనీతో ఒప్పందం చేసుకున్నారు. మొదటిగా హిందీ భాషలో అందుబాటులోకి రాగా రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ చొరవతో ఈ సంవత్సరం జూన్ నుండి తెలుగు భాషలో లభ్యమయ్యేలా రూపొందించారు. ప్రస్తుతం ఈ యాప్ డచ్, ఇంగ్లీషు, ఫ్రెంచ్, పోర్చుగీసు, హిందీ, తెలుగు భాషల్లో మాత్రమే అందుబాటులో ఉంది.

నిమిషాల్లో సమచారం:

ఆండ్రాయిడ్ వెర్షన్‌లో ఈ యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ చేసుకుని లాగిన్ అవ్వాలి. తర్వాత పంటల వారీగా ఆప్షన్లు కనిపిస్తాయి. ఏ పంటపై తెగుళ్ల సమాచారం కావాలో ఆ పంట ఐకాన్‌పై క్లిక్ చేస్తే కెమెరా తెరుచుకుంటుంది. చెట్టుకు తెగులు ఉన్న చోట ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తే కొద్ది సేపటికే ఆ తెగులుకు సంబంధించిన వివరాలు, లక్షణాలు, పిచికారీ చేయాల్సిన మందుల వివరాలతో శాస్త్రవేత్తలుగానీ, అనుభవజ్ఞులైన రైతులు నుంచి కానీ సమాచారం వస్తుంది. సూచించిన మందులు తెచ్చుకుని పిచికారీ చేస్తే సరిపోతుంది. ఎంత మోతాదులో వాడాలో కూడా వివరాల్లో ఉంటుంది. దీనికి ఇంటర్‌నెట్ సదుపాయం తప్పనిసరిగా ఉండాలి. ప్రస్తుతం వరి, అరటి, కంది, గోధుమ, చిక్కుడు, టమాట, దానిమ్మ, పత్తి, బంగాళాదుంప, బొప్పాయి, మామిడి, పెసలు, మినుములు, మిర్చి, మొక్కజొన్న, వంకాయ, సెనగ, సోయాబీన్ వంటి 18 రకాల పంటలకు సంబంధించి ఐకాన్‌లు ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. ఇతర పంటలు అనే ఐకాన్ కూడా ఏర్పాటు చేయడంతో ఇతర పంటల వివరాల కోసం ఆ ఐకాన్‌ను ఎంచుకుంటే మిగిలిన పంటలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంది.

జీపీఎస్ సహకారంతో వాతావరణ సూచనలు :

వాతావరణ పరిస్థితులు, గాలిలో తేమ, వర్షపాతం, ఉష్ణోగ్రత, గాలి వేగం వంటి విషయాలు తెలుసుకునేందుకు ఈ యాప్‌లో ఆప్షన్లు ఉన్నాయి. మొబైల్ జీపీఎస్ ఆప్షన్ ఆన్‌చేస్తే ఆ ప్రాంతానికి సంబంధించిన వాతావరణ సమాచారం తెలుస్తుంది.

పైసా వసూల్



వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు (పాతచిత్రం)

- రవాణాశాఖ చెక్‌పోస్టులో దందా!
- సొమ్ములిస్తేనే గ్రీన్ సిగ్నల్
- అడపాదడపా ఏసీబీ దాడులు
- అయినా మారని సిబ్బంది తీరు
- రోజుకు రూ.30వేల అక్రమ వసూళ్లు

జీలుగుమిల్లి : జీలుగుమిల్లి మండలం తాటియాకులగూడెంలోని రవాణాశాఖ అంతరాష్ట్ర చెక్‌పోస్టులో వసూళ్ల పర్వం యథేచ్ఛగా సాగుతోంది. సిబ్బంది ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నారు. క్యాష్ అండ్ క్యారియర్ సొమ్ములిస్తే ఏ వాహనాన్నైనా వదిలేస్తున్నారు. వాహనం ఇక్కడి నుంచి కదలాలంటే సిబ్బంది చేయి తడపాల్సిందే. లేకుంటే ముందుకు కదలదు.

రోజూ 1500 వాహనాల రాకపోకలు

ఈ చెక్‌పోస్టు మీదుగా రోజుకు 8 వందల నుంచి 1500 వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అన్ని రికార్డులూ బాగున్నా.. ప్రతి వాహనం వద్ద నుంచి రూ.200 తప్పనిసరిగా సిబ్బంది వసూలు చేస్తున్నట్టు విమర్శలు ఉన్నాయి. ఆపైన నిబంధనల ప్రకారం లేని వాహనాలను బట్టి ధరలను నిర్ణయిస్తున్నట్టు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి సిబ్బంది రోజుకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్టు సమాచారం.

అడ్డుకట్ట వేయలేని ఉన్నతాధికారులు !

చెక్ పోస్టులో అక్రమాలకు ఉన్నతాధికారులు అడ్డుకట్ట వేయలేక పోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాటియాకులగూడెం చెక్‌పోస్టులో మూమూళ్లు ఇవ్వని వాహనాలను మాత్రమే ఆపుతున్నట్టు తెలుస్తోంది. తూతూమంత్రం గా తనిఖీలు చేస్తున్నట్టు సమాచారం. రాత్రుళ్ల అసలు వాహనాలు ఆపేవారే ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వాణిజ్యశాఖ చెక్‌పోస్టు ఎత్తివేత

తాటియాకులగూడెంలో జీఎస్టీ అమలు తర్వాత వాణిజ్యశాఖ చెక్‌పోస్టును ఎత్తివేశారు. ప్రస్తుతం రవాణాశాఖ, అటవీ, వ్యవసాయ శాఖ చెక్‌పోస్టులు మాత్రమే ఉన్నాయి. వీటి అక్రమాల్లో కిందస్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకూ అందరూ భాగస్వాములు కావడంతో అక్రమాలకు అడ్డుకట్ట పడడం లేదని, సిబ్బందిపై కనీస పర్యవేక్షణ ఉండడం లేదని తెలుస్తోంది.

అమలు కాని నగదు రహితం

రవాణాశాఖ చెక్‌పోస్టులో నగదు రహిత లావాదేవీలు నిర్వహించాలని ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నా.. అవి ఇక్కడ అమలు కావడం లేదు. ఈ చెక్‌పోస్టులో వాస్తవంగా వాహనాలను తనిఖీలు చేసి టీపీ(టెంపరరీ పర్మిట్‌లు) జారీ చేయాలి. దీంతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేసి కేసులు నమోదు చేయాలి. ఓవర్‌లోడ్‌కు టన్నుకు రూ.1,000 జరిమానాతోపాటు కేసు నమోదు చేయాలి. డ్రైవర్ లైసెన్సు మూడు నెలలపాటు సస్పెండ్ చేయాలి. అయితే ఇవన్నీ చేయకుండా అధికారులు చేయి తడిపిన వాహనాలను వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వాహనదారులూ తమకెందుకొచ్చిన గొడవలే అని నిబంధనలకు విరుద్ధంగా రూ.1,000, రూ.2,000 ఇచ్చి తమ దారిన తాము పోతున్నారని సమాచారం.

అనధికార సిబ్బంది హవా

వసూళ్లు ఎక్కువగా అనధికార సిబ్బంది ద్వారానే సాగుతున్నాయి. అధికారులు ధరను నిర్ణయిస్తే ఆ సిబ్బంది వసూలు చేస్తుంటారు. నిబంధనలు పాటించని వాహనదారులు చెక్ పోస్టుకు కొంత సమీపలో వాహనాన్ని ఆపి, అనధికార సిబ్బంది ద్వారా డబ్బులు అధికారులకు చేరవేస్తారని, ఆ తర్వాతే చెక్ పోస్టు నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తుందని వాహనదారులు చెబుతున్నారు. ఈ మార్గంలో అధిక లోడుకల గ్రానైట్ వాహనాలు అధికంగా తరలుతున్నాయి. ఇవే ఇక్కడి సిబ్బంది, అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి.

అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదు

రవాణా శాఖ చెక్ పోస్టు ఏడాది ఆదాయ లక్ష్యం రూ.పదికోట్లు. 2016–17 సంవత్సరానికి ఇప్పటికే రూ.4కోట్ల 44 లక్షలు వసూలు చేశాం. ఆగస్టు నెలలో 44 అధిక లోడు కేసులు నమోదు చేసి కోర్టుకు తరలించాం. అవినీతి ఆరోపణల్లో వాస్తవం లేదు. వాహనదారులు స్వచ్ఛందంగా వచ్చి పన్నులు చెల్లిస్తున్నారు.

ఎండీ ఆలీ, చెక్‌పోస్టు ఇన్‌చార్జి





చెక్ పోస్టు వద్ద ఆగిన వాహనాలు, చెక్‌పోస్టుకు కొద్దిదూరంలో ఆగిన అధిక లోడు వాహనాలు

నిడదవోలులో చోరీ

14 కాసుల బంగారం, నగదు అపహరణ



చోరీ జరిగిన ఇంటిలో వేలి ముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం

నిడదవవోలు : స్థానిక గణపతి సెంటర్‌లో మంగళవారం ఓ ఇంటిలో దొంగలు పడి దొరికినకాడికి దోచుకుపోయారు. గణపతి సెంటర్ మెయిన్ రోడ్డులో నివాసముంటున్న అన్నదమ్ములు పెరుమళ్ల సుబ్రహ్మణ్యం, నాగబాబు కుటుంబాలు వినాయక చవితి రోజున ఇంటికి తాళాలు వేసి పెద తిరుపతికి వెళ్లారు. మంగళవారం ఉదయం తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు తీసి ఉండడంతో కంగారు పడి లోనికి వెళ్లి చూశారు. బీరువా తెరిచి ఉండడంతో దొంగలు పడ్డారని గుర్తించి లబోది బోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఇంటి వెనుక ప్రహరీ దూకి, వెనుక భాగంలో వేసి ఉన్న తలుపును పగలగొట్టి దొంగలు లోపలకు ప్రవేశించినట్టు భావిస్తున్నారు. బీరువా లాకర్‌లో ఉన్న 14 కాసుల బంగారం, రూ.10 వేల నగదు మాయమైనట్టు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కిళ్లీ కొట్టు నడిపే సుబ్రహ్మణ్యం ఇంటిలో పెట్టిన డ్రింక్ బాటిళ్లను చోరీ అనంతరం దొంగలు తీరుబడిగా తాగి అక్కడే పడేసి వెళ్లినట్టు పరిసరాలను చూస్తే తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై జి.సతీష్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఇంటిలో వేలిముద్రలను సేకరించారు.

విద్యుదాఘాతానికి వ్యక్తి దుర్మరణం



కరెంట్ తీగ పట్టుకోవడంతో మరణించిన సత్యనారాయణ

మొగల్తూరు : తెగిపడిన విద్యుత్ తీగలను పట్టుకున్న వ్యక్తి విద్యుదాఘాతానికి గురై మరణించిన ఘటన కాళీపట్నం తూర్పు గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దాసరి సత్యనారాయణ (52) నరసాపురంలో ప్రైవేటు స్కూలు బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మంగళవారం వేకువ జామున 3గంటల సమయంలో ఈదురుగాలులకు వాటర్ ట్యాంకుకు సరఫరా అయ్యే ఎల్‌టీ విద్యుత్ తీగ తెగిపడింది. సుమారు ఐదు గంటల సమయంలో మంచినీరు తెచ్చుకునేందుకు బయటకు వచ్చిన సత్యానారాయణ దారికి అడ్డంగా పడి ఉన్న కరెంట్ తీగను చూసి దానిని పక్కన పడేద్దామని తాకాడు. వెంటనే విద్యుదాఘాతానికి గురై మరణించాడు. స్థానికులు గమనించి సబ్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. మృతుడి భార్య అలివేలు మంగతాయారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై వై.నాగేశ్వరరావు తెలిపారు.

పాముకాటుకు వ్యక్తి మృతి

లింగపాలెం : కె.గోకవరం శివారు పాశ్చ్యా నగరంలో మంగళవారం పాముకాటుకు ఓ వ్యక్తి మరణించాడు. గ్రామానికి చెందిన సిర్రా రాములు (40) మంగళవారం పొలం పనికి వెళ్లాడు. అక్కడ పాముకాటుకు గురయ్యాడు. దీంతో తోటి కూలీలు ఆయనను చికిత్స నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాములు మృతి చెందాడు.

చీటింగ్ కేసులో నిందితునికి జైలు

ఏలూరు (సెంట్రల్) : చీటింగ్ కేసులో నిందితునికి రెండు నెలల జైలు శిక్ష విధిస్తూ న్యాయస్థానం మంగళవారం తీర్పునిచ్చింది. పోలీసుల కథనం ప్రకారం సత్రంపాడు యాదవనగర్‌కు చెందిన వెంకటసుబ్బయ్య వద్ద చిత్తూరు జిల్లా సీతారామపురానికి చెందిన మేకా నరేంద్రరెడ్డి పనిచేసేవాడు. 2014లో కామవరపుకోటకు చెంది న రామకృష్ణ డబ్బులు ఇవ్వాల్సి ఉండడంతో తన వద్ద పనిచేస్తున్న నరేంద్రను డబ్బులు తీసుకురావాలని పంపించాడు వెంకటసుబ్బయ్య. రామకృష్ణ వద్ద నరేంద్రరెడ్డి రూ.లక్షా 50 వేలు తీసుకుని పరారయ్యాడు. అతనిపై న్యాయస్థానంలో నేరం రుజువు కావడంతో రూ.5,000 జరిమానా, రెండు నెలల జైలుశిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

ఎర్రకాలువ బ్రిడ్జిపై సినీఫక్కీలో ప్రమాదం

- మూడు వాహనాల ఢీ
- రెండు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం
- ప్రయాణికుల అవస్థలు

నల్లజర్ల : అనంతపల్లి ఎర్రకాలువ బ్రిడ్జిపై మంగళవారం వేకువజామున సినీఫక్కీలో ప్రమాదం జరిగింది. ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న సిమెంట్ లోడు లారీ ఎదురుగా వస్తున్న మరో లోడు లారీని ఢీకొని ముందుకు దూసుకెళ్లింది. ఈ క్రమంలో మరో మినీ వ్యాన్‌ను ఢీకొని ఆగింది. ఘటనలో సిమెంట్ లారీ క్లీనర్ రామారావుకు స్వల్పగాయాలయ్యాయి. వాహనాలు బ్రిడ్జికి అడ్డుగా నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. సుమారు రెండు గంటలపాటు వాహనాలు నిలిచిపోయాయి. హైదరాబాద్ నుంచి విశాఖకు హైటెక్ బస్సుల్లో వెళ్లే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. దీంతో పోలీసులు చిన్న వాహనాలను పక్కనే ఉన్న తాడిపూడి వంతెనపైకి మళ్లించారు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది క్రేన్ సాయంతో వాహనాలను పక్కకు తొలగించినట్టు పెట్రోలింగ్ హెడ్ కానిస్టేబుల్ అంభేశ్వరావు తెలిపారు.



వంతెనపై ఢీకొన్న లారీలు



స్తంభించిన ట్రాఫిక్

భవిష్యం

మేషం: ముఖ్యమైన కార్యక్రమాలు ముందుకు సాగవు. ధనవ్యయం. ముఖ్య నిర్ణయాలలో మార్పులు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలు నిరుత్సాహవంతంగా ఉంటాయి.

వృషభం: పరిస్థితులు అనుకూలిస్తాయి. సంఘంలో గౌరవం. ఆధ్యాత్మిక చింతన. వ్యవహారాలలో విజయం. వ్యాపారాలు ఊపందుకుంటాయి. ఉద్యోగులకు ఉన్నతహోదాలు.



మిథునం: కొత్త వ్యక్తుల పరిచయం. శుభవార్తలు. ఆర్థికాభివృద్ధి. పాత సంఘటనలు గుర్తుకు తెచ్చుకుంటారు. విద్యావకాశాలు. వృత్తి, వ్యాపారాలలో కొత్త ఆశలు.

కర్కాటకం: ఎంత శ్రమ పడ్డా ఫలితం కనిపించదు. భూవివాదాలు. ఆలోచనలు నిలకడగా ఉండవు. ఆధ్యాత్మిక చింతన. అనారోగ్య సూచనలు. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితి.

సింహం: పనుల్లో జాప్యం. ఆర్థిక ఇబ్బందులు. దూరప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. బంధువర్గంతో అకారణ వైరం. వ్యాపార, ఉద్యోగాలలో చిక్కులు.

కన్య: అనుకున్న పనులు విజయవంతంగా సాగుతాయి. ఆర్థిక ప్రగతి. వస్తులాభాలు. చిన్ననాటి స్నేహితుల కలయిక. విందువినోదాలు. వృత్తి, వ్యాపారాలు సాఫీగా సాగుతాయి.

తుల: కొత్త రుణాలు చేస్తారు. ఆలోచనలు నిలకడగా ఉండవు. బంధుమిత్రులతో విభేదాలు. ఆరోగ్యభంగం. వ్యాపారాలు నిరాశ కలిగిస్తాయి. ఉద్యోగులకు అదనపు పనిభారం.

వృశ్చికం: కుటుంబంలో శుభకార్యాలు. రాబడి ఆశాజనకంగా ఉంటుంది. సన్నిహితులతో ఉత్సాహంగా గడుపుతారు. కొన్ని వివాదాల నుంచి బయటపడతారు. వృత్తి, వ్యాపారాలలో అనుకూలత.

ధనుస్సు: ఆదాయం అంతగా కనిపించదు. ఆస్తి వివాదాలు. ఆకస్మిక ప్రయాణాలు. అనారోగ్యం. వ్యాపార విస్తరణ యత్నాలు మందగిస్తాయి. ఉద్యోగులకు శ్రమాధిక్యం.

మకరం: నూతన కార్యక్రమాలకు శ్రీకారం. శుభవార్తలు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. ఆహ్వానాలు అందుతాయి. ముఖ్య నిర్ణయాలు. వృత్తి, వ్యాపారాలలో పురోగతి.

కుంభం: చిన్ననాటి సంఘటనలు గుర్తుకు వస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. పాత బాకీలు వసూలవుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తినిస్తాయి.

మీనం: రుణాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలు. ఆరోగ్య, కుటుంబసమస్యలు. వ్యయప్రయాసలు. మిత్రుల నుంచి ఒత్తిడులు. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి.

– సింహంభట్ల సుబ్బారావు

సర్కారు గుడ్డుపై మార్గదర్శకాలు

• గుడ్డు పాడైనా.. బరువు తగ్గినా తిరస్కరించండి • హెచ్‌ఎంలను ఆదేశించిన పాఠశాల విద్యాశాఖ

నిడమర్రు : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ప్రతీ విద్యార్థికి వారానికి మూడు కోడిగుడ్లను విద్యాశాఖాధికారులు అందిస్తున్నారు. ఆగస్టు నెల నుంచి విద్యార్థులకు వండి వడ్డించాల్సిన కోడిగుడ్లు ప్రభుత్వమే ఆయా ఏజెన్సీలకు సరఫరా చేస్తుంది. అయితే సర్కారు అందించే కోడిగుడ్లు కుళ్లిపోవడం, పురుగులు పట్టడం వంటి తదితర సమస్యలతో అటు ఎండీఎం నిర్వాహకులు, ఇటు విద్యార్థులు, ఉపాధ్యాయులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం మీడియాలోనూ చర్చనీయాంశమైంది. దీంతో స్పందించిన రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె. సంధ్యారాణి విద్యార్థులకు సరఫరా చేసే కోడిగుడ్ల విషయంలో పలు మార్గదర్శకాలు విడుదల చేశారు.

వారానికి సరిపడా గుడ్లు తీసుకోవాలి

కోడిగుడ్లు తక్కువ బరువు ఉన్నా, పాడైపోయినా వెంటనే వాటిని సంబంధిత హెచ్‌ఎంలు/ఏజెన్సీలు తిరస్కరించాలని, వారానికి సరిపడా గుడ్లు మాత్రమే తీసుకోవాలని సూచించారు. కోడిగుడ్లు దిగుమతి చేసుకునే విషయంలో ప్రధానోపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పథకం అమలులో భాగంగా పంపిణీ చేస్తున్న గుడ్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఈ మార్గదర్శకాలను ఎంఈవో/హెచ్‌ఎంలకు పంపించారు.

మార్గదర్శకాలు ఇలా..

- మధ్యాహ్న భోజన పథకంలో పాఠశాలలకు గుడ్లు ప్రతివారం పాఠశాల పాయింట్‌కే సరఫరా చేస్తారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు కేవలం ఒక వారానికి సరిపోయే గుడ్లను మాత్రమే తీసుకోవాలి. రెండు మూడు వారాలకు సరిపడా తీసుకువచ్చినా, గుడ్డు బరువు 45 గ్రాములకు తగ్గినా తీసుకోరాదు.
- గుడ్లను సరఫరా చేసే కాంట్రాక్టర్ పాడైన/నిల్వ గుడ్లు ఇస్తే స్కూల్ ప్రధానోపాధ్యాయులు స్వీకరించరాదు. ఇంతకుముందు సరఫరా చేసిన గుడ్లలో ఏమైనా గుడ్లు పాడైనా లేదా పాడైనట్టు గమనించినా/ఉడకబెట్టిన తదుపరి పాడైనట్టు గమనించినా సదరు గుడ్లను విద్యార్థులకు పెట్టరాదు. పాడైన గుడ్లు బదులుగా మంచి నాణ్యమైన గుడ్లు సప్లయర్ నుంచి తీసుకోవాలి. సప్లయర్ నిరాకరించినచో సదరు విషయాన్ని సంబంధిత ఎంఈవో/డీవైఈవో/జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయానికి తెలియజేయాలి. పాడైన గుడ్లు పాఠశాలలో ఉంటే స్కూల్‌కు దూరంగా పారవేయాలి.(స్కూల్ ప్రాంగణంలో పారేయరాదు)
- పాఠశాలకు అందిన కోడి గుడ్లు నిల్వ చేసే ప్రదేశంలో గాలి తగిలేట్టుగా ఏర్పాటు చేసుకోవాలి. మూసి ఉంచిన అల్మారాల్లో/ బాక్సుల్లో ఉంచరాదు. గుడ్డు ఉడికించే ముందు, వాటిని బకెట్ నీటితో పరీక్షించాలి. నీట మునిగిన గుడ్లను మాత్రమే ఉపయోగించాలి. పైకి తేలిన గుడ్లను ఉడకబెట్టరాదు.
- హెచ్‌ఎంలు తీసుకున్న గుడ్లకు రసీదుపై సంతకం చేయాలి. ఆ రసీదు ఆధారంగా అన్ని పాఠశాలలకు అందిన గుడ్లకు సంబంధించిన బిల్లుపై ఎంఈవో సంతకం చేసి, ప్రతి నెల రెండో తేదీ నాటికి డీఈవో కార్యాలయానికి పంపించాలి.
- సప్లయర్‌కు కోడిగుడ్ల బిల్లు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ (సీఎస్ఈ) ద్వారా నేరుగా చెల్లిస్తారు. ఈ నేపథ్యంలో కోడిగుడ్లకు సంబంధించి ఎటువంటి బడ్జెట్ జిల్లాకు విడుదల అవ్వదు. కేవలం కుకింగ్ కాస్ట్(ప్రైమరీ విద్యార్థికి భోజనం ఒక్కంటికి రూ.4.13.. అలాగే యూపీ/ఉన్నత పాఠశాలల విద్యార్థికి భోజనం ఒక్కంటికి రూ.6.18), వంటవాళ్ల గౌరవ వేతనాలు మాత్రమే(ఆగస్టు 1 నుంచి) కేటాయించే బడ్జెట్‌లో ఉంటాయి.

ఏలూరు వాతావరణం


గరిష్టం : 30.9 | కనిష్టం : 25.5

నేడు : పిల్ల గాలులు వీస్తాయి. ఓ మోస్తరు వేడి ఉక్కపోత. ఉదయం, సాయంత్రం, రాత్రి వాతావరణం ఆహ్లాదం. ఆకాశం మేఘావృతం.
గరిష్టం 30 డి.సె. కనిష్టం 25 డి.సె.

రేపు : ఓ మోస్తరు గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతం. పగలు వేడి, ఉక్కపోత. ఉదయం కూడా ఓ మోస్తరు వేడి వాతావరణం.
గరిష్టం 31 డి.సె. కనిష్టం 25 డి.సె.

శుక్రవారం: కొన్ని ప్రాంతాల్లో వర్షం పడే అవకాశం ఉంది. పిల్ల గాలులు వీయవచ్చు. పగలు వేడి, ఉక్కపోత. ఆకాశం మేఘావృతం.
గరిష్టం 32 డి.సె. కనిష్టం 26 డి.సె.

తిరుమల సమాచారం



తిరుమలలో మంగళవారం భక్తుల రద్దీ కొనసాగింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 8 కంపార్టుమెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – 3 ఖాళీ ఉన్నాయి
రూ.50 గదులు – 7 ఖాళీ ఉన్నాయి
రూ.100 గదులు – 25 ఖాళీ ఉన్నాయి
రూ.500 గదులు – 10 ఖాళీ ఉన్నాయి

సేవలు

సహస్రదీపాలంకరణ సేవ – 250 ఖాళీ ఉన్నాయి
వసంతోత్సవం – 200 ఖాళీ ఉన్నాయి
ఆర్జిత బ్రహ్మోత్సవం – 230 ఖాళీ ఉన్నాయి

బుధవారం ప్రత్యేక సేవ : సహస్రకలశాభిషేకం

రైల్వే సమాచారం

విశాఖపట్టణం వైపు

ఏలూరు(ఆర్ఆర్‌పేట) : ఏలూరు నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే రైళ్ల సమయాలు

రైలు నం	పేరు	వరకు	ఏ రోజుల్లో	సమయం
12728	గోదావరి (ఎస్ఎఫ్)	హైదరాబాద్–విశాఖ	ప్రతిరోజు	00.36
15905	వివేక్	కన్యాకుమారి–డిబ్రూగర్	ఆది	00.36
22606	పూరిల్లా (ఎస్ఎఫ్)	విల్లుపురం–పురిల్లా	ఆది	00.36
22860	చెన్నై–పూరి (ఎస్ఎఫ్)	చెన్నై సెంట్రల్–పూరి	మంగళ	00.36
22604	ఖరక్‌పూర్ (ఎస్ఎఫ్)	విల్లుపురం–ఖరక్‌పూర్	బుధ, గురు	00.36
22826	షాలిమార్ (ఎస్ఎఫ్)	చెన్నై సెంట్రల్–షాలిమార్	శుక్ర	00.36
12784	విశాఖ (ఎస్ఎఫ్)	సికింద్రాబాద్–విశాఖ	ఆది	00.49
12740	గరీబ్‌రథ్ (ఎస్ఎఫ్)	సికింద్రాబాద్–విశాఖ	ప్రతిరోజు	02.41
18048	అమరావతి	వాస్కోడిగామా–హౌరా	సోమ,బుధ,శుక్ర,శని	03.46
22856	సంత్రాగచ్చి (ఎస్ఎఫ్)	తిరుపతి–సంత్రాగచ్చి	మంగళ	03.46
12738	గౌతమి	సికింద్రాబాద్–కాకినాడ పోర్టు	ప్రతిరోజు	04.06
17487	తిరుమల	తిరుపతి–విశాఖ	ప్రతిరోజు	04.21
18510	నాందేడ్	నాందేడ్–విశాఖ	సోమ, గురు, శుక్ర	04.41
22870	విశాఖ (ఎస్ఎఫ్)	చెన్నై–విశాఖ	బుధ	05.00
12829	భువనేశ్వర్ (ఎస్ఎఫ్)	చెన్నై–భువనేశ్వర్	శని	05.01
67300	రాజమండ్రి ఈఎంయూ	విజయవాడ–రాజమండ్రి	ప్రతిరోజు	05.55
22802	విశాఖ (ఎస్ఎఫ్)	చెన్నై–విశాఖ	ఆది	05.58
12666	కన్యాకుమారి (ఎస్ఎఫ్)	కన్యాకుమారి–హౌరా	ఆది	06.26
15629	గౌహతి	చెన్నై–గౌహతి	మంగళ	06.26
12664	తిరుచ్చి	తిరుచురాపల్లి–హౌరా	బుధ, శని	06.26
15929	దిబ్రూగర్–చెన్నై	దిబ్రూగర్	శుక్ర	06.26
12718	రత్నాచల్	విజయవాడ–విశాఖ	ప్రతిరోజు	06.51
12840	మెయిల్	చెన్నై–హౌరా	ప్రతిరోజు	07.26
18464	ప్రశాంతి	బెంగుళూర్–భువనేశ్వర్	ప్రతిరోజు	07.41
12862	లింక్	నిజాముద్దీన్–విశాఖ	ప్రతిరోజు	07.50
13352	బొకారో	అలిప్పీ–ధన్‌బాద్	ప్రతిరోజు	08.16
18502	జీంబ్–విశాఖ	గాంధీదామ్–విశాఖ	మంగళ	08.25
57225	బీజడ్ఎ–విశాఖ	విజయవాడ–విశాఖ	ప్రతిరోజు	09.48
17333	ఎల్‌టీటీ	కాకినాడపోర్టు	సోమ, శుక్ర	09.54
12864	యశ్వంత్‌పూర్	యశ్వంత్‌పూర్–హౌరా	ప్రతిరోజు	10.22
17239	సింహాద్రి	గుంటూరు–విశాఖ	ప్రతిరోజు	10.34
12804	స్వర్ణజయంతి	నిజాముద్దీన్–విశాఖ	సోమ, గురు	12.10
22850	షాలిమార్	సికింద్రాబాద్–షాలిమార్	శుక్ర	12.11
18112	టాటా (ఎ)	యశ్వంత్‌పూర్–టాటా	సోమ	13.03
57257	కాకినాడ (పా)	తిరుపతి–కాకినాడ	ప్రతిరోజు	13.53
12806	జన్మభూమి	సికింద్రాబాద్–విశాఖ	ప్రతిరోజు	14.27
11019	కోణార్క్	ముంబై–భువనేశ్వర్	ప్రతిరోజు	15.07
22884	గరీబ్‌రథ్	యశ్వంత్‌పూర్–పూరీ	ఆది	15.46
17205	షిర్డీ	సాయినగర్–కాకినాడ	సోమ, బుధ, శుక్ర	16.25
18504	షిర్డీ	సాయినగర్–విశాఖ	శని	16.25
12659	గురుదేవ్	నాగర్‌కోయల్–షాలిమార్	సోమ	17.06
18646	ఈస్ట్‌కోస్ట్	హైదరాబాద్–హౌరా	ప్రతిరోజు	17.34
22818	మైసూర్	మైసూర్–హౌరా	సోమ	17.45
57231	ఫాస్ట్ ప్యాసింజర్	విజయవాడ–కాకినాడ	ప్రతిరోజు	18.33
22611	న్యూజల్పాగురి	చెన్నై–జల్పాగురి	బుధ	18.41
67261	రాజమండ్రి	విజయవాడ–రాజమండ్రి	ప్రతిరోజు	19.46
18402	వహా–పూరి	వహా–పూరి	గురు	20.10
18568	క్యూఎల్ఎన్	కొల్లాం–విశాఖ	శని	20.10
22880	భువనేశ్వర్	తిరుపతి–భువనేశ్వర్	ఆది	20.11
22872	భువనేశ్వర్	తిరుపతి–భువనేశ్వర్	సోమ	20.11
57271	రాయగడ	విజయవాడ–రాయగడ	ప్రతిరోజు	22.16
12704	ఫలక్‌నూమా	సికింద్రా–హౌరా	ప్రతిరోజు	22.26
22852	వివేక్	మంగళూర్–సంత్రాగంచి	ఆది	22.41
12375	ఎంఎస్, ఎఎస్ఎన్	చెన్నై–అసన్‌సోల్	శని	22.41

బుల్లితెర

W

సాక్షి SAKSHI TV


ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 నిరీక్షణ
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 స్క్రీన్‌ప్లే
మ.02.30 న్యూస్ ఫీచర్
సా.04.30 మార్గం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్

టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.09.30 కథ
మ.12.00 నాయకుడు
మ.03.00 అమ్మాయి బాగుంది
సా.06.00 నీ స్నేహం
రా.09.00 ఆటాడిస్తా



మూవీస్ నౌ
ఉ.06.15 ఇన్‌టు ద స్టార్మ్
ఉ.08.00 మిస్టర్ నైస్ గై
ఉ.09.50 స్పిసిస్
మ.01.40 డై అనదర్ డే
రా.09.00 వాల్-ఈ




హెచ్‌బీవో
ఉ.07.43 ఎక్స్ ఎక్స్ ఎక్స్
ఉ.11.28 షావోలిన్ సాసర్
మ.03.10 సూసైడ్ స్క్వాడ్
సా.05.15 ద హ్యాంగోవర్-3
రా.09.00 మంకీ ట్రబుల్



సోనీ పిక్స్
ఉ.06.00 స్పైడర్ మ్యాన్
ఉ.08.24 మెన్ ఇన్ బ్లాక్ 3
ఉ.10.35 ద మమ్మీ రిటర్న్స్
సా.05.56 వార్‌క్రాఫ్ట్
రా.11.00 వోల్ఫ్ టొటెమ్



మా మూవీస్
ఉ.07.00 నా బంగారు తల్లి
ఉ.09.00 ఒకటో నంబర్ కుర్రోడు
మ.12.00 రాజేశ్వరి కల్యాణం
మ.03.00 రౌద్రం
సా.05.00 విల్లా



జీ యాక్షన్
ఉ.07.07 స్టైల్
ఉ.11.08 ఇన్సాఫ్
మ.02.04 శివమ్
రా.08.00 ప్లాట్‌ఫామ్
రా.11.05 ఇన్సానియత్


బులియన్ నరసాపురం

24 క్యారెట్ల బంగారం
10 గ్రాముల ధర రూ.29,670

22 క్యారెట్ల బంగారం
10 గ్రాముల ధర రూ.27,740

వెండి కిలో ధర రూ.39,530

కొబ్బరి ధరలు పాలకొల్లు



పాత కాయ
(వెయ్యింటికి) రూ. 9,500

కొత్త కాయ
(వెయ్యింటికి) రూ. 8,500

రిపోర్టర్ల ఫోన్ నంబర్లు : ఆచంట - జేఎం మోహన్, 97053 46806, పెనుగొండ - జి. శ్రీనివాసరావు, 97054 01918, పెనుమంత్ర - ఎస్. జయ రామకృష్ణ, 99081 63555, పోడూరు - బి.చిట్టిబాబు, 73309 35849





నిమజ్జనానికి తరలిన కొత్తూరులో ప్రతిష్టించిన వినాయకుని ప్రతిమ



ఆచంట సంతమార్కెట్ సెంటరులో గణనాథుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

జై జై గణేశా..

ఆచంట :

చవితి వేడుకలలో భాగంగా మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో గణనాథుడి నిమజ్జనోత్సవాలు వేడుకగా నిర్వహించారు. కోడేరులోని వశిష్ట గోదావరిలో ప్రతిమలను నిమజ్జనం చేశారు. తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, గరగ నృత్యాల, యువకుల కేరింతల నడుమ ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో వినాయకుని ప్రతిమలను ఉంచి పుర వీధులగుండా గ్రామోత్సవాలు నిర్వహించారు. ఆచంట పంచాయతీ పరిధి కొత్తూరులో గణపతి గ్రామోత్సవం వేడుకగా నిర్వహించారు. స్థానిక సంతమార్కెట్ సెంటరు, వంగతాళ్లచెరువు, కవురుపాలెంలో స్వామివారి విగ్రహాలను నిమజ్జనం చేశారు. పెదమల్లం, కోడేరు, కొడమంచిలి, కరుగోరుమిల్లి, ఎ.వేమవరం, పెనుమంచిలి, భీమలాపురం తదితర గ్రామాల నుంచి గణనాథుడి విగ్రహాలను ఊరేగింపుగా తరలించి కోడేరులోని వశిష్టగోదావరిలో నిమజ్జనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా నిమజ్జనోత్సవాలు



ఇలపర్రులో గణేశ్ నిమజ్జనోత్సవంలో వివిధ వేషధారణలు

భక్తి శ్రద్ధలతో ..

పెనుగొండ : వినాయక చవితి ఉత్సవాలు పెనుగొండ మండలంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎక్కువగా సిద్ధాంతం వశిష్ట గోదావరిలో గణపతి ప్రతిమలను నిమజ్జనం చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించే గ్రామోత్సవాల్లో బుట్ట బొమ్మల విన్యాసాలు, వేషధారణలు ఆకట్టుకొంటున్నాయి.

వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఆచంట : ఎ.వేమవరం పంచాయతీ పరిధి గెద్దాడవారిపాలెంకు వెళ్లేందుకు అనువుగా తాడేరు డ్రెయిన్‌పై వంతెన నిర్మించాలని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోశెట్టి లీలా సుబ్బారావు మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డ్రెయిన్‌పై వంతెన లేకపోవడంతో గె ద్దాడవారిపాలెం వాసులు అవస్థలు పడుతున్నారని పేర్కొన్నారు. డ్రెయిన్ దాటడానికి చెక్కలతో చేసిన వంతెన మీదుగానే బిక్కుబిక్కుమంటూ దాటుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

పెనుగొండలో 144 సెక్షన్

పెనుగొండ : పెనుగొండలో 144 సెక్షన్ అమలులో ఉందని ఎస్సై బీవై.కిరణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. గ్రామంలో ఎటువంటి సమావేశాలు, ధర్నాలు, ర్యాలీలు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్తులు అందరూ సహకరించాలి ఆయన కోరారు.

ఘనంగా క్రీడాదినోత్సవం



మార్టేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రహ్లాదరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



పెనుగొండ 'ఎస్వీకేపీ' కళాశాలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో అధ్యాపక బృందం

పెనుమంత్ర : మార్టేరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రపంచ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్టేరు గ్రామానికి గుర్తింపు తెచ్చిన ప్రముఖ క్రీడాచార్యులు స్వర్గీయ ప్రహ్లాద రెడ్డి విగ్రహానికి పాఠశాల హెచ్ఎం చెల్లబోయిన శివజ్యోతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అందరిలోనూ క్రీడా స్ఫూర్తిని రగిలించిన ప్రహ్లాదరెడ్డి ఆదర్శప్రాయుడని ఈ సందర్భంగా ఆమె అన్నారు. కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షుడు కోనాల కొదండ చంద్రశేఖర్‌రెడ్డి, పీడీ కె.కృష్ణారెడ్డి, ప్రహ్లాదరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకులు జి.లక్ష్మణరెడ్డి, మురళి, శ్రీను పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

పెనుగొండ : విద్యార్థులు క్రీడలకు విద్యలో భాగంగా ప్రాధాన్యం ఇస్తే శారీరక ధారుఢ్యంతో పాటు, మానసికోల్లాసాన్ని పొందవచ్చునని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కేఎస్ఆర్‌పీ కుమార్ జాన్ అన్నారు. హాకీ దిగ్గజం ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా కళాశాల క్రీడా విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 2016-17లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు సీహెచ్ శ్వేత, ఈ ఉమామహేశ్వరికి మహిళా సాధికారిక సమితి ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో మహిళా సాధికారిక సమితీ కన్వీనరు ఏఎన్ రమామణి, డాక్టర్ ఎం.రాజ్యలక్ష్మి, బి.మామిళ్ల, పి.మాధవి, కె.శ్రీలక్ష్మి, కె.సుగుణ, ఎన్ఎస్ఎస్ అధికారి కేవీసురేష్‌బాబు, పీడీ డైరెక్టర్ బి.బాపిరెడ్డి పాల్గొన్నారు.

పాడి-పంట

పాదుల మాటున.. తెగుళ్ల కాటు

- చిక్కుడు పాదులను విరివిగా ఆశిస్తున్న పురుగులు
- లార్వాదశలోనే నివారించాలని వ్యవసాయాధికారుల సూచన
- దిగుబడిపై రైతుల్లో ఆందోళన

పెరవలి : ఏతీగ మాటున ఏ తెగులు దాగి ఉన్నదో అన్న చందంగా జిల్లాలోని పాదుజాతి కూరగాయల సాగు కొన సాగుతోంది. తెగుళ్ల ఉధృతి అధికంగా ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక మోతాదులో పురుగు మందులు, ఎరువుల వినియోగంతో పురుగులు మరింత బలపడుతున్నాయని మండల వ్యవసాయాధికారి పి.చంద్రశేఖర్ తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో చిక్కుడు పంటను ప్రస్తుతం ఎల్లో మొజాయిక్, కాయతొలుచు పురుగు, పేనుబంక, లద్ది, తామర, తుప్పుమచ్చ, ఆకుమచ్చ తెగుళ్లు వ్యాపించి ఉన్నాయని చెప్పారు. లార్వా దశలోనే తెగుళ్ల నివారణ చేపట్టాలని ఆయన అన్నారు. సస్యరక్షణ చర్యలను ఇలా వివరించారు.



ఖండవల్లిలో చిక్కుడుపాదులు, (అంతరచిత్రం) పి.చంద్రశేఖర్ వ్యవసాయాధికారి

కాయతొలుచు, లద్ది పురుగులు

తల్లిరెక్కల పురుగు పెట్టే గుడ్ల ద్వారా వచ్చే లార్వాతో ఈ తెగులు మొక్కలను ఆశిస్తుంది. నులిపురుగుల మాదిరిగా ఉండే ఈ పురుగులు కాయలను ఆశించి రంధ్రాలు చేసి అందులోకి వెళ్లిపోవడంతో కాయలపై పుచ్చులు ఏర్పడతాయి. ఈ లార్వా జీవితచక్రం 30 నుంచి 35 రోజులు మాత్రమే ఉంటుంది. ఆ తరువాత కోశస్థదశకు (ప్యూఫాదశ) 12 నుంచి 15 రోజులు ఉంటుంది. ఈ దశ తరువాత రెక్కల పురుగుగా రూపాంతరం చెందుతుంది. లార్వాదశలోనే వీటిని నాశనం చేయాలి కానీ రెక్కల పురుగుగా మారితే ఏ పురుగుమందులు కూడా వీటిని నాశనం చేయలేవు. రైతులు ఎక్కువగా అత్యంత విషపూరితమైన సింథటిక్, పైథ్రాయిడ్, మోనోక్రోటోపస్, క్లోరిఫైరీపాస్ మందులు వినియోగిస్తున్నారు, దీని వల్ల తెగులు నివారణ ఎలా ఉన్నా మిత్రపురుగులు నాశనమవుతున్నాయి. మిత్రపురుగులు లేని పంట తెగులు బారిన పడుతుంది.

నివారణ చర్యలు

చిక్కుడుపాదులు ఐదు ఆకులు వేసిన వెంటనే వేపనూనెను ఒక లీటరు నీటిలో 5 మిల్లీలీటర్లు వేపనూనెను కలిపి పిచికారీ చేస్తే నివారణ అవుతుంది. అప్పటికీ తెగులు ఆశించి ఉంటే క్లోరాంట్రానిలిప్రోల్ 60 మిల్లీలీటర్ల మందును 120 లీటర్ల నీటిలో కలిపి, స్పైనోసాడ్ 50 మిల్లీలీటర్ల మందును 120 లీటర్ల నీటిలో కలిపి, నువాల్యురాన్+ఇండాక్స్‌కార్బ్ మందును 250 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఈ తెగులు నివారణ చేయవచ్చు.



ఆకులపై ఏర్పడిన తుప్పమచ్చ తెగులు

రసంపీల్చే పురుగులు

వైరస్ తెగుళ్ల ఈ పురుగులు ద్వారా వ్యాప్తిచెందుతాయి. తెల్లదోమల వల్ల ఇది వ్యాప్తి చెందుతుంది. ఆకులు, పూలపై ఆశించిన రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు పండుబారి గిడసబారిపోతాయి. దీనివల్ల పాదులు పాడైపోవడంతో దిగుబడి తగ్గిపోతుంది.

నివారణ చర్యలు : వైరస్ తెగులు సోకిన తీగలను తొలగించి కాల్చిబరాడిద చేయాలి. 10 నుంచి 15 రోజులకు ఒకసారి వేపనూనెను 5 మిల్లీలీటర్ల మందులో ఒక లీటరు నీరు కలిపి పిచికారీ చేయాలి. తెగులు ఉధృతి ఎక్కువగా ఉంటే ఎసిటావీఫ్రిడ్ 40 గ్రాములు 200 లీటర్ల నీటిలోను లేదా ట్రైజోపాస్ ఒక మిల్లీలీటరు ఒక లీటరు నీటిలోను కలిపి పిచికారీ చేస్తే నివారణ అవుతుంది.

తుప్పుతెగులు, ఆకుమచ్చ తెగులు

ఈ తెగుళ్ల ఆకులపైన, కాయలపైన ఎక్కువగా ఆశిస్తాయి. ఇవి వచ్చిన పాదులపై ఆకులు, కాయలపైన మచ్చలు ఏర్పడి నాణ్యత తగ్గి మొక్కల పెరుగుదల ఆగిపోతుంది.

నివారణ చర్యలు

కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే నివారణ అవుతుంది.

పేనుబంక

పేనుబంకపురుగులు ఆకులు, పువ్వులు, కాయలపై ఆశించి రసాన్ని పీల్చివేయడం వల్ల మొక్కలు పండుబారి గిడసబారిపోతాయి. కాయలను ఆశిస్తే రసంపీల్చివేయడం వల్ల ఎండిపోతాయి. దీని నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్‌డెమటాన్ 2 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పంటలను పరిశీలించిన వ్యవసాయ విద్యార్థులు

భీమడోలు : మండలంలోని కోడూరుపాడులోని వ్యవసాయ, ఉద్యానవన పంటలను మంగళవారం ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమండ్రి వ్యవసాయ కళాశాల విద్యార్థులు పరిశీలించారు. గ్రామీణ కృషి అనుభవం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు పంట చేలను, కొబ్బరి తోటలను పరిశీలించారు. కొబ్బరి చెట్లకు ఎర్రముక్కు పురుగు సోకినట్టు గుర్తించారు. పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలను రైతు ఏపూరి రాజేంద్రప్రసాద్‌కు వివరించారు. విద్యార్థులు ఎం.వెంకటేశ్వరరావు, పి.సంజయ్, పి.సోమిరెడ్డి, కె.జనార్ధన్, ఎం.శ్రీహరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



కోడూరుపాడులో రైతుకు సూచనలిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

తిండితిప్పలు

- వరండాల్లోనే భోజనం
- పాఠశాలల్లో విద్యార్థుల అవస్థలు
- డైనింగ్ హాళ్లు ఏవీ?
- వంటషెడ్లూ లేవు
- పట్టించుకోని సర్కారు
- అధికారులదీ అదే తీరు

వీరవాసరం : విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నామని గొప్పలు పోతున్న సర్కారు పాఠశాలల్లో వసతుల కల్పనలో విఫలమవుతోంది. ఫలితంగా పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మధ్యాహ్న భోజన సమయంలో వారి అవస్థలు వర్ణణాతీతం. డైనింగ్ హాళ్లు లేక విద్యార్థులు పాఠశాలల్లో వరండాల్లోనూ, ఆరుబయట కూర్చుని తినాల్సి వస్తోంది.


డైనింగ్ హాలు లేక ఏలూరు ఏఆర్‌డీజీకే స్కూల్లో ఇటీవల మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థుల తిప్పలివీ..


కొణితివాడ హైస్కూల్లో పాఠశాల ఆవరణలో కూర్చుని మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థులు

వానొస్తే తరగతి గదుల్లోకి పరుగులు తీయాల్సిన దుస్థితి.

ఒక్కచోటా డైనింగ్ హాల్ లేదు !

జిల్లా వ్యాప్తంగా 2,564 ప్రాథమిక , 247 ప్రాథమికోన్నత, 507 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం 3,318 పాఠశాలలు ఉన్నాయి. సుమారు 3 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. భీమవరం డివిజన్‌లో 563 ప్రాథమిక పాఠశాలలు, 41 ప్రాథమికోన్నత పాఠశాలలు, 97 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 40 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా ఏ ఒక్క పాఠశాలలోనూ డైనింగ్ హాలు లేదు. 20శాతం పాఠశాలల్లో వంటషెడ్లు లేవు. దీంతో విద్యార్థులతోపాటు మధ్యాహ్న భోజన నిర్వాహకులూ ఇబ్బందులు పడుతున్నారు. ఆరుబయట లేదా, ఇళ్ల వద్ద వంట చేస్తున్నారు. సర్కారు స్పందించి పాఠశాలలన్నింటిలోనూ డైనింగ్‌హాళ్లు, వంట షెడ్లు నిర్మించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎండనకా.. వాననకా.. అవస్థలు



మధ్యాహ్న భోజనం చేయడానికి ఎండనకా.. వాననకా ఇబ్బంది పడుతున్నాం. వర్షం వస్తే నేలంతా బురదమయమవుతోంది. ఆవరణలో తినడానికి నానా అవస్థలు పడుతున్నాం. మాకు డైనింగ్ హాళ్లు నిర్మించాలి.

వి.నరేష్, విద్యార్థి

కింద కూర్చోవాలంటే అవస్థ



మాకు కింద కూర్చొని భోజనం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. చేతిలో ప్లేటు పట్టుకుని నుంచుని తినాలంటే రసం, సాంబార్లు దుస్తులపై పడిపోతున్నాయి. త్వరగా తిని తరగతులకు వెళ్లలేక పోతున్నాం. భోజనాలకు ప్రత్యేక గదులు, బల్లలు ఉంటే బాగుంటుంది.

మహేశ్వరి, విద్యార్థిని

ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం



ప్రభుత్వ పాఠశాలల్లో డైనింగ్ హాళ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. ముందుగా బాలికల హైస్కూళ్లలో డైనింగ్ హాళ్లు నిర్మించడానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుంది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేకచర్యలు తీసుకుంటున్నాం.

ఆర్.ఎస్.గంగా భవానీ, డీఈఓ

తండ్రీకొడుకుల దుర్మరణం

- ప్రైవేటు బస్సు ఢీకొని దుర్ఘటన
- ఇద్దరు చిన్నారులకు గాయాలు


లంకా వెంకటేష్ (పాతచిత్రం)


చేబ్రోలు వద్ద మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న ప్రైవేటు హైటెక్ బస్ ఇదే

ఉంగుటూరు : స్థానిక 16వ నంబర్ జాతీయ రహదారిపై చేబ్రోలు వద్ద సోమవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకులు మరణించారు. ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. నల్లమాడు గ్రామానికి చెందిన లంకా వెంకటేష్(35), అతని కుమారులు సుమన్(13), యువరాజు, కుమార్తె మహాలక్ష్మి వినాయకచవితి ఉత్సవాలకు గణపవరం మండలం మెయ్యేరు వెళ్లారు. సోమవారం రాత్రి మోటార్ సైకిల్‌పై మెయ్యేరు నుంచి నల్లమాడు వస్తూండగా చేబ్రోలు రైల్వే గేటు వద్ద అమలాపురం నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ ప్రైవేటు హైటెక్ బస్సు ఢీకొంది. దీంతో లంకా వెంకటేష్, సుమన్, యువరాజు, మహాలక్ష్మిలకు గాయాలయ్యాయి. వెంకటేష్, సుమంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో వారిని హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా వెంకటేష్, సుమన్ అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. చేబ్రోలు ఎస్సై తాడి నాగ వెంకట రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీరు కలుషితం కాకుండా చర్యలు

మత్స్యశాఖ జేడీ అంజలి

అత్తిలి : రొయ్యల చెరువుల నుంచి వచ్చే మురుగునీరు వల్ల సాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్.అంజలి చెప్పారు. అత్తిలి శివారు పాలి రోడ్డులోని రొయ్యల చెరువుల నుంచి వచ్చే మురుగునీటి వ్యవస్థను మంగళవారం ఆమె పరిశీలించారు. తక్కెళ్లమ్మ ఆలయం వద్ద ఉన్న రొయ్యల చెరువుల నుంచి వచ్చే మురుగునీటితో తమ పంటచేలకు నష్టం వాటిల్లుతోందని అత్తిలికి చెందిన ఓ రైతు ఏలూరు కలెక్టరేట్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణకు కలెక్టర్ ఆదేశించడంతో మత్స్యశాఖ జేడీ అంజలి డ్రెయినేజీ, నీటి పారుదల, రెవెన్యూశాఖ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫిర్యాదుదారునితోపాటు స్థానిక రైతులతో మాట్లాడారు. రొయ్యల చెరువుల మురుగునీరు పైపు నంబర్ 25లో కలుస్తున్న విషయాన్ని ఆమె గుర్తించారు. దీంతో డ్రెయినేజీ, ఇరిగేషన్‌శాఖ అధికారులు సాగునీరు కలుషితం కాకుండా డిజైన్ రూపొందించి ఫిర్యాదుదారునికి వివరించారు. కార్యక్రమంలో డ్రెయిన్స్ ఈఈ రఘునాథ్, డీఈ సుజాత, ఏఈ అరుణకుమారి, తహసీల్దార్ జి కనకరాజు, అత్తిలి సెక్షన్ ఇరిగేషన్ ఏఈ డీవీ శివకుమార్, ఇన్‌చార్జ్ ఎఫ్‌డీవో గోపాలకృష్ణ, వీఆర్వోలు పాల్గొన్నారు.


విచారణ చేస్తున్న మత్స్యశాఖ జేడీ అంజలి, ఇరిగేషన్, డ్రెయినేజీ శాఖ అధికారులు

బాలికను మోసగించిన వ్యక్తి అరెస్ట్


అరెస్ట్ చేసిన నిందితుడిని చూపిస్తున్న ఎస్సై జయబాబు, సిబ్బంది

చాగల్లు : మండలంలోని ఊనగట్ల గ్రామానికి చెందిన బాలికను నమ్మించి మోసం చేసిన ఘటనలో రాజమండ్రికి చెందిన నందా శ్రీనును అరెస్టు చేసినట్టు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 24న ఊనగట్ల గ్రామానికి చెందిన బాలికకు నందా శ్రీను మాయమాటలు చెప్పి మోటార్‌సైకిల్‌పై తీసుకెళ్లి మోసం చేశాడు. మళ్లీ గతనెల 27న నిడదవోలులో ఆమెను వదిలి వెళ్లిపోయాడు. ఘటనపై బాలిక తల్లిదండ్రులు గతనెల 29న చాగల్లు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దీంతో నిందితుడు శ్రీనును రాజమండ్రిలో కొవ్వూరు డీఎస్పీ ఎస్.వెంకటేశ్వరరావు అరెస్టు చేశారు.

చినమిల్లి ఇంటి వద్ద పోలీసుల మోహరింపు

భీమవరం : కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చినమిల్లి వెంకట్రాయుడు గృహం వద్ద మంగళవారం పోలీసులు భారీగా మోహరించారు. కాపు రిజర్వేషన్ల కోసం మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం చేపట్టిన పాదయాత్రకు ప్రభుత్వం ఆటంకాలు కలిగిస్తున్న నేపథ్యంలో బుధవారం కిర్లంపూడిలో కాపు జేఏసీ సమావేశం నిర్వహించతలపెట్టారు. ఈ సమావేశానికి వెంకట్రాయుడు వెళ్తారని భావించిన పోలీసులు మంగళవారం వీరవాసరం మండలం రాయలంలోని ఆయన నివాసం వద్ద భారీగా మోహరించారు. దీంతో రాయుడిని గృహనిర్బంధం చేశారనే వార్త దావానంలా వ్యాపించడంతో భీమవరం పట్టణం, పరిసర ప్రాంతాల్లోని కాపు సంఘం నాయకులు రాయలం తరలివెళ్లారు. పోలీసులు తనను దూరప్రాంతాలకు మాత్రమే వెళ్లవద్దని ఆంక్షలు విధించారని, స్థానికంగా తిరగడానికి ఆంక్షలు లేవని వివరించారు. కిర్లంపూడిలో జరిగే కాపు జేఏసీ సమావేశానికి వెళ్లేందుకూ ఎటువంటి ఆంక్షలు విధించలేదని వెల్లడించారు.

ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో ఆర్జేడీ విచారణ

పాలకొల్లు అర్బన్ : స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్జేడీ డాక్టర్ కె.ప్రమీల(రాజమండ్రి), మహిళా సాధికారత సంస్థ అకడమిక్ అధికారులు రోజ్‌లాండ్, ఎస్.మాధవి మంగళవారం విచారణ చేపట్టారు. కళాశాలలో పారిశుధ్యలోపం, అధ్యాపకుల్లో భేదాభిప్రాయాలపై మహిళా సాధికారిత సంస్థకు పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో మంగళవారం అధికారులు కళాశాలను సందర్శించారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు ఎవరూ హాజరు కాకపోవడంతో అధికారులు కళాశాల పరిసరాలను పరిశీలించారు. పారిశుధ్యంలోపం ఉన్నట్టు గుర్తించారు. హాజరుశాతాన్ని పరిశీలించి కొన్ని తరగతుల్లో అటెండెన్స్ తీసుకోలేదని గమనించారు. అధ్యాపకులను మందలించారు. విద్యార్థుల తల్లిదండ్రులతోనూ, అధ్యాపకులతోనూ కళాశాల పాలకవర్గ సభ్యులు సమావేశాలు నిర్వహించి కళాశాల ప్రగతిని సమీక్షించాలని సూచించారు. ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛభారత్ విధిగా పాటించాలని చెప్పారు. ప్రతి తరగతి గది ముందు చెత్తబుట్టను ఏర్పాటు చేయాలని ప్రిన్సిపల్‌కి సూచించారు. అనంతరం కళాశాలలో లైంగిక వేధింపుల విషయమై విద్యార్థులను విచారించారు. అధ్యాపకుల వ్యక్తిగత సమాచారం తీసుకున్నారు. లైంగిక వేధింపులు, ఈవ్‌టీజింగ్‌కి పాల్పడితే చట్టపరంగా శిక్ష తప్పదని హెచ్చరించారు. ప్రిన్సిపల్ ఎం.సాగర్‌ప్రకాశం, సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ సాయిబాబా కళాశాల ప్రగతిని వివరిస్తూ అధ్యాపకులు, నాన్‌టీచింగ్ స్టాఫ్ కొరత, ఆర్థికపరమైన ఇబ్బందులను ఆర్జేడీ ప్రమీల దృష్టికి తీసుకువెళ్లారు.

నిర్మలగిరిలో వ్యక్తి అనుమానాస్పద మృతి!


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

దేవరపల్లి : దేవరపల్లి మండలం గౌరీపట్నం వద్ద ఉన్న నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. పుణ్యక్షేత్రానికి వచ్చి గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పి.వాసు తెలిపారు.

కళావల్లభుడు




హైదరాబాద్ అన్నమయ్యపురంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న డాక్టర్ రమేష్, కూచిపూడి నృత్యభంగిమ

- కళల పునరుజ్జీవనానికి కంకణబద్ధుడైన వైద్యుడు
- కూచిపూడి, సంగీతంలో రాణింపు
- దేశ, విదేశాల్లో ప్రదర్శనలు

ఏలూరు (ఆర్ఆర్ పేట) :

స్వతహాగా ఆయన వైద్యుడు. భారతీయ సంప్రదాయ కళలంటే ఆయనకు ప్రాణం. అయితే కళలకు రోజురోజుకూ ఆదరణ తగ్గిపోతుండడంతో పునరుజ్జీవనానికి తన ప్రయత్నం చేయాలని కంకణబద్ధుడయ్యారు. ఆయనే ఏలూరుకు చెందిన డాక్టర్ కనుమూరి రమేష్. కాకినాడలో పుట్టి పెరిగిన రమేష్‌బాబు 1986లో పాండిచ్చేరి జిప్‌మర్ విద్యాసంస్థలో ఎంబీబీఎస్ చేశారు. 1992లో బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ పట్టా పొందారు. అప్పటి నుంచి వైద్య వృత్తిలో ప్రవేశించిన రమేష్ ఏలూరులో 2000లో ప్రశాంతి హాస్పిటల్ నెలకొల్పి ఇక్కడి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

సంగీతం, కూచిపూడిలో శిక్షణ


డాక్టర్ రమేష్ తల్లి రాజ్యలక్ష్మి ఆలిండియా రేడియో కళాకారిణి. ఆమె స్ఫూర్తితో చిన్నతనంలోనే సంగీతం, కూచిపూడి నృత్యాలు నేర్చుకోవడం ప్రారంభించిన రమేష్ విద్యాభ్యాసం కోసం వాటిని మధ్యలోనే ఆపివేయాల్సి వచ్చింది. కొన్నాళ్లు వైద్య వృత్తిని కొనసాగించిన అనంతరం ఆయనలోని కళాతృష్ణ మళ్లీ మేల్కొంది. నేటి సమాజంలో తల్లిదండ్రులకు భారతీయ కళల పట్ల చిన్నచూపు ఉండడం ఆయనకు నచ్చలేదు. వారిలో మార్పు తీసుకురావాలనే తపనతో సంగీతంలోనూ, నృత్యంలోనూ తిరిగి శిక్షణ పొందారు. వాటిని ప్రదర్శించి ఆయా కళలకు విస్తృత ప్రచారం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంకితభావంతో ఆయన చేసిన సాధనతో ఆయా అంశాల్లో మంచి ప్రావీణ్యం సాధించి దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగారు. దీని ద్వారా విదేశీయుల్లో కూడా భారతీయ కళల పట్ల ఆకర్షణ కలిగే విధంగా తనవంతు కృషి చేస్తున్నారు.

అవార్డులు, బిరుదులు

2015లో విశాఖపట్నంలోని వైశాఖి 8వ అఖిల భారత నృత్యోత్సవాల్లో ప్రదర్శన సందర్భంగా ఆ సంస్థ డాక్టర్ రమేష్‌ను యువ నాట్యశ్రీ అవార్డుతో సత్కరించింది. అదే ఏడాది హైదరాబాద్ నటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వహించిన అఖిల భారత నృత్యోత్సవాల్లో చేసిన ప్రదర్శనలో నాట్యవేద అవార్డునిచ్చి సత్కరించారు.

ఎన్నో ప్రదర్శనలు

2012లో హైదరాబాద్ రవీంద్రభారతిలో కూచిపూడి నృత్య ప్రదర్శన, ఏలూరులో 2012, 2013 సంవత్సరాల్లో జరిగిన నృత్యోత్సవాల్లో ప్రదర్శనతో పలువురు కళారంగ ప్రముఖులు, ఆహూతులను ఆకట్టుకున్నారు. అప్పటి నుంచి తన ప్రదర్శనల పరంపరను కొనసాగిస్తూ 2013లో జరిగిన రాష్ట్రస్థాయి యూరాలజీ వైద్యుల సదస్సులో, 2014లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో శ్రీ మహాకాళేశ్వర మందిరంలో ప్రదర్శన ఇచ్చారు. అలాగే 2014లో బెంగుళూరు గురు రవిశంకర్ ఆశ్రమంలో జరిగిన దసరా ఉత్సవాల్లో ఆయన సమక్షంలో నృత్య ప్రదర్శన చేశారు. 2015లో రాంచీలో జరిగిన జాతీయ యూరాలజీ కాన్ఫరెన్స్‌లో కూడా నృత్య ప్రదర్శన చేసి వైద్య వృత్తి భారతీయ కళల అభ్యాసానికి, పోషణకు అడ్డంకి కాదనే సందేశాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న వైద్యులకు అందించారు. గతేడాది ఢిల్లీలో జరిగిన ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల్లో ఆయన ప్రదర్శించిన కూచిపూడి నృత్యం దేశ విదేశాల నుంచి వచ్చిన అనేకమంది కళాకారులను అబ్బురపరిచింది. ఇవి కూచిపూడి నృత్యంలో ఆయనకున్న ప్రవేశానికి కొన్ని మచ్చుతునకలు కాగా సంగీతంలో కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన వైద్యుల సదస్సులో తన సంగీతంతో అన్నమాచార్య కీర్తనలు ఆలపించి ఓలలాడించారు. హైదరాబాద్‌లో ప్రముఖ సంగీత కళాకారిణి శోభారాజ్ సమక్షంలో అన్నమయ్యపురంలో అన్నమాచార్యకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి శోభారాజ్ ప్రశంసలు అందుకోవడం ఆయనకు మధురానుభూతిగా నిలిచింది. ఇటీవల పోలీస్ శాఖ నేర నిరోధానికి ప్రత్యేకంగా రూపొందించిన ఒక యాప్ ప్రచారం కోసం నిర్మించిన షార్ట్‌ఫిల్మ్‌లో నటించి నటనలో కూడా తన ఉనికిని చాటుకున్నారు.



డాక్టర్ రమేష్ ప్రదర్శించిన కూచిపూడి నృత్యంలోని భంగిమ

కళలను ప్రోత్సహించండి



భారతీయ సంప్రదాయ కళలకు విదేశాల్లో ఎంతోమంది అభిమానులున్నారు. మన కళలను నేర్చుకోవడానికి అనేకమంది విదేశీయులు భారతదేశం వస్తుంటే భారతీయులు మాత్రం పాశ్చాత్య మోజులో పడి మన కళలను విస్మరించడం బాధిస్తోంది. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు కూడా మన సంగీతం, మన సంప్రదాయ నృత్యాలను వారి పిల్లలకు నేర్పుతుంటే ఇక్కడి వారు మాత్రం పాశ్చాత్య సంస్కృతి మోజులో వాటికి బానిసలుగా మారే ప్రమాదం ఏర్పడింది. వారిలో మార్పు తీసుకురావడం కోసమే చిన్న ప్రయత్నం చేస్తున్నా.

– డాక్టర్ కనుమూరి రమేష్, యూరాలజిస్ట్



చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాల్లో వివిధ భంగిమలు



చోడవరంలో సందడి చేస్తున్న సైబీరియా పక్షులు

రెక్కలు వచ
మళ్లీ పుట్టింటికి వస్తా
రెక్కలు కట్టుకుని మళ్లీ
తప్పక వస్తూ మనక

అతిథు

నల్లజర్ల :

నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి ఏటా మాదిరిగానే సైబీరియా పక్షులు వచ్చాయి. దీంతో ఆ గ్రామంలో సందడి మొదలైంది. గ్రామస్తులు ఈ పక్షులను ఎంతో అపురూపంగా చూసుకుంటారు. పక్షులు గ్రామానికి వస్తున్నాయంటే వర్షాలు ప్రారంభం కాబోతున్నాయన్న సంకేతంగా ఇక్కడి వారు భావిస్తారు. జూలై చివరలో వచ్చిన ఈ పెలికాన్ పక్షులు చెట్లపై గూళ్లు కట్టుకొని గుడ్లు పెట్టి పొదిగి పిల్లలు పెద్దయ్యాక వాటితో కలిసి నవంబర్‌లో తిరుగు ప్రయాణమవుతాయి. ఈ క్రమంలో గ్రామంలో పక్షుల కిలకిలరావాలు గ్రామస్తులకు ఎంతో ఆనందాన్నిస్తాయి. జంటలుగా సంచరించడం, పక్షి పిల్లలకు ఆహారం తినిపించడం, నీరు తాగించడం, వాటికి ఎగరడం నేర్పించడం వంటి కనువిందైన సన్నివేశాలు గ్రామస్తులకు మానసికోల్లాసం కలిగిస్తుంటాయి. ఇది ఎన్నో ఏళ్లుగా జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. వాటి రాక వల్ల తమ గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తులు విశ్వసిస్తుంటారు. వీటిని ప్రత్యేక అతిథులుగా భావించిన గ్రామస్తులు సంరక్షణకు చొరవ చూపడంతో ప్రాణ హాని, భయం లేకుండా ఆహార అన్వేషణకు పరిసరాల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ మరింత అలరిస్తున్నాయి.

పక్షులకు పుట్టిల్లు

విదేశీ పక్షులకు చోడవరం పుట్టిల్లుగా మారింది. మూడు దశాబ్దాలుగ
డకు ఏటా క్రమం తప్పకుండా పక్షులు వస్తున్నాయి. చెట్లపై గూళ్లు క
తర్వాత ఆడ, మగ పక్షులు ఒకదానితో ఒకటి తొక్కిళ్లు పడతాయి
సంపర్కం తర్వాత 10–12 రోజులకు ఆడపక్షి రోజుకొకటి చొప్పున
నుంచి నాలుగు గుడ్లు పెడుతుంది. ఆ తర్వాత గుడ్లపై కూర్చుని
తుంది. ఆ కాలంలో మగపక్షి పొలాల్లోకి వెళ్లి నత్తలు, చిన్న చిన్న
కీటకాలను తెచ్చి ఆడపక్షి నోట్లో జారవిడుస్తుంది. 21 రోజులకు గుడ్ల
పిల్లలు బయటకు వస్తాయి. ఆ తర్వాత ఆడ, మగ పక్షులు ఆ
వేటాడి తెచ్చి పిల్లలకు పెడుతుంటాయి. చోడవరంలో నత్తగుల్లలు
గా ఉండటంతో వాటి ఆహారానికి కొదవ ఉండదు. ఏటా క్రమం
కుండా రావడానికి ఇది కూడా ప్రధాన కారణం.



వన్యప్రాణి యాజమాన్య విభాగం ఏర్పాటు చేసిన బోర్డు

నృత్యాంజలి





గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏలూరు రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో మంగళవారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన నాట్యాచార్యులు గండికోట రాజేష్ శిష్యులు అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలకు నృత్యప్రదర్శనలు చేసి భక్తులను అలరించారు.

– ఏలూరు (ఆర్ఆర్ పేట)








- చోడవరంలో విదేశీ విహంగాల సందడి
- దశాబ్దాలుగా క్రమం తప్పకుండా రాక
- సైబీరియా పక్షులను సంరక్షిస్తున్న గ్రామస్తులు

జిల్లాలో పురుడు పోసుకుంటాయ్..
...ర్చాక ఎగిరిపోయి ఎక్కడెక్కడో పెరుగుతాయి.. సంతానోత్పత్తి కోసం
...స్తాయి.. నాలుగైదు నెలల పాటు సందడి చేస్తాయి.. ఆ తర్వాత పిల్లలతో కలిసి
...ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతాయి. కొన్నేళ్లుగా సైబీరియా పక్షులు జిల్లాకు క్రమం
...ు అతిథులుగా మారాయి. ఈ ఏడాది కూడా నల్లజర్ల మండలం చోడవరంకు
అతిథులొచ్చి సందడి చేస్తున్నాయి.

...లొచ్చాయ్



...గా ఇక్క
...ట్టుకున్న
... ఇలా
... రెండు
...పొదుగు
...చేపలు,
...పగిలి
...రాన్ని
...ఎక్కువ
... తప్ప



గ్రామస్తుల సంరక్షణ

విదేశీ పక్షులు గ్రామంలోకి రాగానే వీటి సంరక్షణ బాధ్యతలను గ్రామస్తులే చేపడతారు. గతంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా పనిచేసిన అల్లూరి కృష్ణారావు స్వగ్రామం చోడవరం. ఎవరైనా పక్షులను వేటాడరని తెలిస్తే ఆయన పిలిచి కొరడాలతో కొట్టేవారని గ్రామస్తులు చెబుతారు. ఆనాటి నుంచే ఎవరైనా పక్షులను వేటాడినా గ్రామస్తులు జరిమానా విధిస్తారు. దీంతో వేటగాళ్లెవరూ ఈ పరిసర ప్రాంతాలకు రారు. వన్యప్రాణి విభాగం వారు కూడా పక్షుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. గ్రామంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. పక్షుల ప్రేమికులు ఈ సైబీరియా పక్షులను తిలకించేందుకు గ్రామానికి వస్తారు.

పక్షులొస్తేనే వానలొస్తాయి



చిన్నతనం నుంచి ఈ పక్షులను చూస్తున్నాం. ఇవి వస్తేనే వానలొస్తాయని, పంటలు పండుతాయని మాకు నమ్మకం. వీటి రాక ఆలస్యమైతే ఆ ఏడాది వర్షాలు ఆలస్యమవుతూ ఉంటాయి. పక్షులకు ఎటువంటి హాని కలగకుండా గ్రామస్తులంతా చూస్తాం.

– అయినం నాగేశ్వరావు, పడమర చోడవరం

పర్యాటక ప్రదేశంగా గుర్తించాలి



సైబీరియా పక్షులు మా గ్రామానికి ఏటా వస్తాయి. ఏటా ఆరేడు మాసాలు ఇక్కడ సందడి చేస్తాయి. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి. కానీ ఇప్పటి వరకు అటువైపుగా ప్రభుత్వం ఆలోచించడం లేదు.

– కొత్తపల్లి రమేష్, పడమర చోడవరం

గరగపర్రు దీక్షలకు మహిళల మద్దతు



దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఐద్వా, మహిళా సంఘాల నాయకులు

పాలకోడేరు: గరగపర్రు దళితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయకపోతే ఐక్య ఉద్యమాలను ఉధృతం చేస్తామని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కళింగ లక్ష్మణ్, కేవీపీఎస్ జిల్లా నాయకుడు కారుమంచి క్రాంతి బాబు హెచ్చరించారు. గరగపర్రులో దళితులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం రెండో రోజూ కొనసాగాయి. లక్ష్మణరావు, క్రాంతిబాబు మాట్లాడుతూ దళితులను మభ్యపెట్టే విధంగా గాలిమాటలు చెప్పిన మంత్రుల ఆచూకీ తెలపాలంటూ ఎద్దేవా చేశారు. మిగిలిన 37 కుటుంబాలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఎందుకు ఆలోచిస్తున్నారని ప్రశ్నించారు. దీక్షా శిబిరాన్ని ఐద్యా, మహిళా సంఘాల నాయకులు సందర్శించి మద్దతు ప్రకటించారు. కేవీపీఎస్ మండల నాయకులు ఏలూరిబాబు, సులోమాన్, ప్రసాద్, పోరాట నాయకులు చరబండ రాజు, ఎరిచర్ల రాజేష్, ఏసుపాదం, ఐద్వా నాయకురాలు కళ్యాణి, మెట్టె వరలక్ష్మి, తాడేపల్లి దీనమ్మ, ఎరిచర్ల గీత, డొల్ల సుభద్ర, గంగాభవని పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



తణుకు నరేంద్ర సెంటర్‌లో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తణుకు అర్బన్ : దళితులను కించపరిచేలా మాట్లాడిన మంత్రి ఆదినారాయణరెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టుచేయాలని తణుకు బార్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఇటీవల మంత్రి ఆది దళితులపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా తణుకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులు బహిష్కరించి రాష్ట్రపతి రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. న్యాయవాదులు గొల్లపల్లి అంబేడ్కర్ మాట్లాడుతూ దళితులు చదువుకోరు, శుభ్రంగా ఉండరన్న మంత్రి వ్యాఖ్యలు దళితుల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. ఎన్నికల సమయంలో దళితుల ఓట్ల కోసం తాపత్రయం పడే నాయకులు ఏరు దాటాక తెప్పతగలేసినట్లుగా వ్యవహరిస్తుండడం దారుణమన్నారు. అనంతరం తహసీల్దారు పీఎన్‌వీ సత్యవతి, సీఐ చింతా రాంబాబులకు వినతిపత్రాలను అందించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కేవీఎస్ఎన్ మూర్తి, కార్యదర్శి జె.వెంకటేశ్వర్లు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.చిట్టిమోషే, వెన్నపు సుధాకర్, సీనియర్ న్యాయవాదులు కామన మునిస్వామి, కౌరు వెంకటేశ్వర్లు, కేఎంఎస్ఎస్ కుమార్, జె.కనకం, పొట్ల సురేష్, నేతల సోమేశ్వరం, టి.నెహ్రూ, నక్కా అజయకుమార్ పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం చెల్లించండి

ఏలూరు (సెంట్రల్): ప్రకృతి వైపరీత్యాలు, తెగుళ్ల వల్ల జరిగిన పంటల నష్టానికి జిల్లాలో రైతాంగానికి ఇవ్వాల్సిన రూ.220 కోట్ల ఇన్‌పుట్స్ సబ్సిడీ నిధులను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని కౌలురైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక అన్నే భవనంలో జరిగిన కౌలురైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక పైసా కూడా ఇన్‌పుట్స్ సబ్సిడీ ఏ రైతుకూ ఇవ్వాలేదని, 2012 సంవత్సరం నీలం అనంతర తుఫాన్లు, భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని కౌలురైతులు నష్టపోయారని వివరించారు. గతేడాది కృష్ణడెల్టాలో పెసర, మినుము పంటలకు తల మాడు తెగులు వచ్చి వేలాది ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినా నేటికీ పరిహారం రైతులకు అందలేదని ఆయన ఆరోపించారు. భూపేంద్రసింగ్ కమిటీ సిఫార్సుల ప్రకారం పంట నష్ట పరిహారాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం చంద్రబాబు ఆమేరకు నిధులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పి.రెడ్డియ్య, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రికి ప్రోత్సాహకం

- ఉత్తమ సేవల్లో తణుకు ఏరియా ఆస్పత్రి ముందంజ
- కేంద్ర ప్రభుత్వ అవార్డు ఎంపికకు అర్హత
- రెండో స్థానంలో ఏలూరు జిల్లా ఆస్పత్రి
- వచ్చేనెలలో ఎన్‌క్యూఏఎస్ కమిటీ సభ్యుల పర్యటన

తణుకు అర్బన్ :

తణుకు ఏరియా ఆస్పత్రి క్వాలిటీ సర్వీసెస్ అవార్డుకు ఎంపికకానుంది. ఈ ఆస్పత్రిలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు అందించడమే ఇందుకు కారణమంటున్నారు వైద్యాధికారులు. నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) ఆధ్వర్యంలో జరిగే ఈ ఎంపికకు ఢిల్లీ నుంచి ఓ కమిటీ వచ్చేనెలలో జిల్లాలోని అన్ని ఆస్పత్రులను సందర్శించనుంది. రాష్ట్రంలో 22 ఏరియా ఆస్పత్రులను గుర్తించగా అందులో తొలిదశలో తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి, విశాఖ జిల్లా అనకాపల్లి ఆస్పత్రులు ఎంపికయినట్టు వైద్యాధికారులు చెబుతున్నారు.



తణుకు ఏరియా ఆస్పత్రి

జిల్లాలో ఆస్పత్రులు ఇలా..

జిల్లాలో ఏలూరు జిల్లా ఆస్పత్రి, తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో ఏరియా ఆసుపత్రులు, 14 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 91 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ ఆస్పత్రుల్లో అందే వైద్యసేవల్లో నాణ్యతా ప్రమాణాలను ఎన్‌క్యూఏఎస్ టీం పరిశీలించనుంది. గత మూడు నెలల పర్యవేక్షణలో భాగంగా 93 పాయింట్లతో ఇప్పటికే తణుకు ఏరియా ఆస్పత్రి మొదటి స్థానంలో 78 పాయింట్లతో ఏలూరు జిల్లా ఆస్పత్రి రెండో స్థానంలో ఉన్నట్టు తెలుస్తోంది.

ఎంపికైతే కేంద్రం నిధులు విడుదల

ప్రభుత్వ ఆస్పత్రులను ప్రోత్సహించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తోంది. 70 పాయింట్లు సాధించిన ఆస్పత్రులన్నీ అవార్డులకు అర్హత సాధిస్తాయి. అర్హత సాధిస్తే ఏడాదికి ఆస్పత్రిలోని ఒక్కో మంచానికి రూ.10 వేలు చొప్పున మూడేళ్లపాటు ప్రోత్సాహం అందనుంది. 100 పడకల తణుకు ఏరియా ఆస్పత్రికి ఏడాదికి రూ.10 లక్షలు చొప్పున మూడేళ్ల పాటు రూ.30 లక్షలు అందనుంది. ఇందులో 75 శాతం ఆస్పత్రి అభివృద్ధి కమిటీకి జమచేసుకుని ఆస్పత్రి అభివృద్ధికి వినియోగించాల్సి ఉంటుంది. మిగిలిన 25 శాతం ఆస్పత్రి నాణ్యతా ప్రమాణాల పటిష్టతకు కృషిచేసిన వైద్యులు, సిబ్బంది అవసరాలకు వినియోగించుకోవచ్చు.

నాణ్యతా ప్రమాణాలే కొలమానం

సర్కారు ఆస్పత్రుల్లో నాణ్యతా ప్రమాణాలను ఢిల్లీ నుంచి వచ్చే కమిటీ అనువణువూ పరిశీలిస్తుంది. పచ్చదనం, పరిశుభ్రతతోపాటు రోగులకు అందే సేవలను బేరీజు వేసుకుని ఈ ఎంపిక చేస్తారు. ఉదాహరణకు ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత, అందుబాటులో ఎన్ని వీల్‌చైర్స్, ట్రాలీలు అందుబాటులో ఉన్నాయి, వైద్యులు రాసే మందుల చీటీ రాసే విధానం, ఆస్పత్రి ఆవరణ విస్తీర్ణం బట్టి ఎంత బ్లీచింగ్, ఫినాయిల్ నిబంధనల మేరకు ఉపయోగిస్తున్నారా? లేదా ? తదితర అంశాలను పరిశీలిస్తారు. మూడునెలలుగా వైద్యసేవలు, శానిటేషన్, సెక్యూరిటీ, డ్రింకింగ్ వాటర్, వార్డుల్లో ఉన్న వసతులు, రికార్డులతోపాటు వైద్యులు, సిబ్బందిని కమిటీ సభ్యులు నేరుగా అడిగి తెలుసుకుంటారు.

క్వాలిటీ సర్వీసెస్‌కు ప్రాధాన్యత



వైద్యశాఖకు సంబంధించి క్వాలిటీ సర్వీసెస్‌కు కేంద్రం పెద్దపీట వేస్తుంది. రోగులకు అందే క్వాలిటీ సర్వీసెస్‌లో తణుకు ఏరియా ఆస్పత్రి ముందువరసలో ఉంది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణను ఈ విషయంలో అభినందించాలి.

– డాక్టర్ కె.శంకరరావు, డీసీహెచ్ఎస్, ఏలూరు

మరిన్ని సౌకర్యాలకు ఆస్కారం



క్వాలిటీ సేవల్లో ఎంపికైతే ఆస్పత్రి మరింత అభివృద్ధి చేయవచ్చు. ఏడాదికి రూ.10 లక్షలు చొప్పున మూడేళ్లు రూ.30 లక్షలు కేంద్ర నిధులు సమకూరుతాయి. దీంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించవచ్చు.

– డాక్టర్ వెలగల అరుణ, సూపరింటెండెంట్, తణుకు ఏరియా ఆస్పత్రి

31న నేరుగా ఉద్యోగాలకు ఆహ్వానం

ఏలూరు (మెట్రో): డీఆర్‌డీఏ, డీడీయూజీకేవై, ఈజీఎం ఆధ్వర్యంలో జిల్లాలో టీటీడీసీ వట్లూరులో ఈనెల 31న నేరుగా ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిన్యూ మొబైల్స్ కంపెనీలో బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ 10 ఉద్యోగాలకు బికాం పూర్తి చేసినవారు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ 10 ఉద్యోగాలకు ఎంబీఏ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. సాక్షి పబ్లికేషన్స్‌లో సర్వీస్ రిప్రజెన్‌టేటివ్ రెండు ఉద్యోగాలకు డిగ్రీ, సేల్స్ ప్రమోటర్స్ 30 ఉద్యోగాలకు 10వ తరగతి చదివిన వారు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు పశ్చిమగోదావరి జిల్లా, రాజమండ్రి, విజయవాడలోనూ విధులు నిర్వహించాల్సి ఉంటుందని వివరించారు. ఇతర వివరాలకు కె.రవీంద్రబాబు సెల్ నంబర్ 89859 06062లో సంప్రదించాలని పీడీ కోరారు.

సాగునీటి యాజమాన్యమే కీలకం

ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పీడీ షాజా నాయక్

బుట్టాయగూడెం : ఉద్యాన, వ్యవసాయ పంటలకు సాగునీటి యాజమాన్యం కీలకమని ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ పీడీ కె.షాజా నాయక్ అన్నారు. బిందు, తుంప్పర్ల సేద్యం, వాటిని వాడుకునే విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హార్టికల్చర్ ట్రైనింగ్ సెంటర్ గోపన్నపాలెం వారి ఆధ్వర్యంలో మండలంలోని కేఆర్‌పురం ఐటీడీఏలో మంగళవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాగునీటి వనరుల సద్వినియోగానికి డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ ఇరిగేషన్‌లు రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలుగా ఉన్నాయన్నారు. బిందు సేద్యం వల్ల 100 శాతం నీరు ఆదా అవుతుందని, ఒకే సమయంలో పంట మొత్తానికి నీరు అందించవచ్చని అన్నారు. డ్రిప్ పద్ధతిపై ఎరువులు ఎక్కువ, తక్కువ కాకుండా ఎప్పటికప్పుడు సమర్థవంతంగా అందించవచ్చని వివరించారు. తమ సంస్థ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో 2017–18 సంవత్సరాలకు 45 వేల హెక్టారుల్లో సేద్యం లక్ష్యంకాగా, ఇప్పటి 10,200 హెక్టారుల్లో రైతులు సాగు చేసే



కార్యక్రమంలో మాట్లాడుతున్న షాజా నాయక్

విధంగా రిజిస్ట్రేషన్ పూర్తి చేశామని తెలిపారు. 1,772 మంది రైతులకు 2,227 హెక్టార్లలో డ్రిప్ పరికరాలను రైతుల పొలాల్లో అమర్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌హెచ్‌టీఐ ప్రిన్సిపల్ ఎ.కోటయ్య, ఐటీడీఏ పీహెచ్‌వో కె.ఆనందకుమార్, పీఏవో వి.హేమకుమాతి, ఎంఐడీసీ సత్యనారాయణ, గిరిజన రైతులు పాల్గొన్నారు.

స్వాహా సొమ్ము రికవరీ

- బ్యాంకు మిత్రపై నివేదిక ఉన్నతాధికారులకు
- ఏపీఎం రామకృష్ణ

పెరవలి : స్వాహా చేసిన డ్వాక్రా సంఘాల సొమ్మును బ్యాంకు మిత్ర నుంచి వసూలు చేశామని ఏపీఎం ఆలపాటి రామకృష్ణ తెలిపారు. ఉసులుమర్రులో సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం ఆయా సంఘాల సభ్యులతో సమావేశాలు నిర్వహించి ఏఏ సంఘాల నుంచి ఎంత సొమ్ము వాడుకున్నది సభ్యులకు వివరించారు. ఉసులుమర్రు గ్రామంలో రెండు గ్రామ సమైఖ్యలు ఉండగా, ఒక్కొక్క సమైఖ్యలో 30 సంఘాలు ఉన్నాయని తెలిపారు. ఎస్సీ, బీసీ ఏరియాలో సమైఖ్యలో 32 సంఘాలు ఉండగా వీటిలో 29 సంఘాలు పనిచేస్తున్నాయని ఇందులో 11 సంఘాల వద్ద నుంచి రూ.87,200 స్వాహా అయినట్టు గుర్తించామన్నారు. ఈ సొమ్మును బ్యాంకు మిత్ర జెన్ని చిన్నారి నుంచి రికవరీ చేశామని చెప్పారు. ఆ సొమ్మును బ్యాంకులో జమచేసి సంబంధిత రసీదును డ్వాక్రా సంఘాల లీడర్లకు అందించారు. చిన్నారి పనిచేసిన సంఘాల్లో ఆర్థిక లావాదేవీల్లో తేడా వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని, తమ ఖాతాలను సరిచూచుకోవాలని లీడర్లకు సూచించారు. 11 సంఘాల ఖాతాల్లో అవకతవకలకు పాల్పడిన బ్యాంకుమిత్రకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించామని, తదుపరి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని రామకృష్ణ వివరించారు.

బయోమెట్రిక్ బెంగ


జిల్లా కేంద్ర గ్రంథాలయం

- పనొకచోట.. ముద్ర మరోచోట
- కిలో మీటర్ల దూరం ప్రయాణం
- వారానికి రెండు రోజులు గైర్హాజరుగా నమోదు
- గ్రంథపాలకులకు అదనపు విధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు.. క్షేత్రస్థాయిలో ప్రస్తుతం అవి సమస్యలతో సతమతమవుతున్నాయి. సిబ్బంది కొరత వెంటాడుతోంది. బయోమెట్రిక్ హాజరు తప్పని సరి చేయడంతో వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గంటల తరబడి సమయాన్ని వృథా చేసుకోవాల్సి వస్తోంది. కిలోమీటర్ల దూరం వెళ్లి హాజరు వేయాల్సివస్తోంది. ఇతర శాఖల పనివేళలు, గ్రంథాలయాల పనివేళల్లో వ్యత్యాసం కారణంగా సిబ్బంది హాజరు వేసినా నమోదు కాని పరిస్థితి ఉంది. రోజుకు నాలుగుసార్లు హాజరు వేయాల్సి రావడం, మెషీన్లు లేకపోవడం తదితర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం ఉండడంలేదని గ్రంథ పాలకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత

జిల్లాలో గ్రేడ్–1 లైబ్రరీలు 5, గ్రేడ్–2 లైబ్రరీలు–2, గ్రేడ్–3 లైబ్రరీలు 65 ఉన్నాయి. వీటిలో పనిచేయడానికి 129 మంది సిబ్బంది అవసరంకాగా ప్రస్తుతం 78 మంది మాత్రమే పనిచేస్తున్నారు. వీరిలో గ్రేడ్–1 లైబ్రేరియన్లు నలుగురు, గ్రేడ్–2 లైబ్రేరియన్ ఒకరు, గ్రేడ్–3 లైబ్రేరియన్లు 42 మంది ఉన్నారు. వీరిలో 15 మంది వరకూ మహిళా లైబ్రేరియన్లు ఉన్నారు.

హాజరుకు అవస్థలు

బయోమెట్రిక్ హాజరు అమలుతో గ్రంథాలయాల సిబ్బంది తీవ్ర పనిఒత్తిడికి గురవుతున్నారు. గ్రంథాలయాలు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తాయి. దీంతో వీరు నాలుగు సార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తోంది. ఇతర ఉద్యోగులయితే ఉదయం 10 గంటలకు, సాయంత్రం 4 గంటలకు బయోమెట్రిక్ వేస్తే సరిపోతుంది. గ్రంథపాలకులు మాత్రం 8 గంటలకు పాఠకులకు దినపత్రికలు, ఇతర పత్రికలు పఠనానికి అనువుగా సిద్ధం చేయాలి. దీనికి కనీసం అరగంట ముందొస్తే గానీ సాధ్యం కాదు. బయోమెట్రిక్ హాజరు వేయాలంటే ఇంకో అరగంట ముందే రావాల్సి వస్తోంది. జిల్లా కేంద్ర గ్రంథాలయం మినహా ఏ గ్రంథాలయంలోనూ బయోమెట్రిక్ మెషీన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆయా గ్రంథాలయాల సిబ్బంది పంచాయతీ కార్యాలయం లేదా తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో హాజరు వేయాల్సివస్తోంది. ఈ కార్యాలయాలు గ్రంథాలయాలకు సుమారు 5 కిలో మీటర్ల దూరం ఉంటుంది. రోజుకు నాలుగు సార్లు బయోమెట్రిక్ వేయాలంటే గ్రంథపాలకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

విధుల్లో ఉన్నా లేనట్టే

జిల్లాలోని పలువురు గ్రంథపాలకులు రెండు గ్రంథాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారు. ఒక పూట ఒక గ్రంథాలయం, మరో పూట మరో గ్రంథాలయంలో విధులు నిర్వహిస్తువారు బయోమెట్రిక్ హాజరు వేయడానికి నానా హైరానా పడుతున్నారు. ఒక్కోసారి ఆయా కార్యాలయాలు తెరిచి ఉండకపోవడం, బయోమెట్రిక్ మెషీన్ అందుబాటులో లేకపోవడం, మరికొన్ని సందర్భాల్లో కార్యాలయాలు తెరిచి ఉన్నా విద్యుత్ సరఫరా లేకపోవడం వంటి సమస్యలతో హాజరు వేయలేకపోతున్నారు. ఆదివారాలు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. లైబ్రరీలకు పనిదినం కావడంతో ఆదివారాల్లో హాజరు వేయలేకపోతున్నారు. శుక్రవారం లైబ్రరీలకు సెలవు కావడంతో గ్రంథపాలకులు హాజరు వేయరు. ఈ నేపథ్యంలో వారు విధుల్లో ఉన్నా వారానికి రెండు రోజులు గైర్హాజరైనట్లు నమోదవుతోంది. దీంతో వారు లబోదిబోమంటున్నారు.

15 రోజుల్లో మెషీన్ల ఏర్పాటు



బయోమెట్రిక్ హాజరుకు గ్రంథపాలకులు ఇబ్బందులు పడడం వాస్తవమే. త్వరలోనే పర్చేజింగ్ కమిటీ సమావేశం నిర్వహించి మెషీన్ల కొనుగోలుకు నిర్ణయం తీసుకుంటాం. సుమారు రూ.15 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం. మరో 15 రోజుల్లో జిల్లాలోని అన్ని గ్రంథాలయాల్లో బయోమెట్రిక్ మెషీన్లు ఏర్పాటు చేస్తాం.

– జయ్యవరపు శ్రీరామ్మూర్తి, చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ

కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : విద్యుత్ శాఖలో కాంట్రాక్ట్ కార్మికులు, స్పాట్ బిల్లర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, పసీక్‌లోడ్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోరాటాలకు పర్మినెంట్ ఉద్యోగుల గుర్తింపు పొందిన సంఘాలు నిర్ణయించాయని ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ 327 జిల్లా అధ్యక్షుడు భూక్యా నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం స్థానిక గిరిజన భవన్‌లో జరిగిన సమావేశంలో కాంట్రాక్ట్ కార్మికులు స్పాట్ బిలర్ల యూనియన్ సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ త్వరలో జిల్లాలో అన్ని గుర్తింపు పొందిన సంఘాలూ జేఏసీగా నిర్ణయం తీసుకుంటాయన్నారు. విద్యుత్ సంస్థలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ నాయకులు డి.వాసుదేవరావు, డి.కిరణ్ కిషోర్, సీహెచ్ కృష్ణ, జి.విజయ రాజు, బి.క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

ఈనాం భూ సమస్యలకు త్వరలో పరిష్కారం


మాట్లాడుతున్న మంత్రి మాణిక్యాలరావు

పెంటపాడు: పెంటపాడులో ఈనాం రైతుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు పేర్కొన్నారు. మంగళవారం పెంటపాడు సంగం మేడ వద్ద ఈనాం రైతులతో ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనాం అబాలిషన్ చట్టం ప్రకారం సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ప్రయత్నించానని చెప్పారు. పెంటపాడు, ఉమామహేశ్వరం గ్రామాలలో సుమారు 550 మంది రైతులు ఈనాం సమస్యల వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో రెండు నెలల్లో ఈ సమస్యలను క్యాబినెట్‌లో చర్చించి ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పారు. 1993లో దీనిపై ఎంజాయ్‌మెంట్ సర్వే జరిగిందన్నారు. సమావేశంలో రైతు నాయకులు నల్లమిల్లి రాఘవరెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ నల్లమిల్లి చినగోపిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యులు కిలపర్తి వెంకటరావు, డీసీసీబీ డైరెక్టర్ దాసరి అప్పన్న, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కృష్ణవేణి, సర్పంచ్లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సుగర్ ఫ్యాక్టరీ కార్మికుల దీక్ష

చాగల్లు : చాగల్లులో జైపూర్ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు, ఉద్యోగులు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. మంగళవారం 14వ రోజు దీక్షలో వీవీ శ్రీనివాసరావు, ఎన్.వీరభద్రం, ఎన్.సీతా రామరావు, హెచ్.దుర్గాప్రసాద్, కె.శ్రీనివాసరావు కూర్చున్నారు. ఫ్యాక్టరీ ఉద్యోగ, కార్మిక సంఘం అధ్యక్షుడు నీరుకొండ కృష్ణారావు, యూనియన్ నాయకులు తూమురోతు చిన్నారావు, తాళ్లూరి శ్రీనివాసరావు, మాదాల శ్రీనివాసరావు, బొడ్డు వీరవెంకట తాతారావు, కొడవటి గంగరాజు, ఖండవిల్లి వెంకటాచార్యులు పాల్గొన్నారు. రెండేళ్లగా ఇవ్వాల్సిన పీఎఫ్ సొమ్ము, పది నెలల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

గిడుగు స్ఫూర్తితో తెలుగును కాపాడదాం

ఏలూరు (మెట్రో) : తెలుగు వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు జయంతి తెలుగుజాతికి తెలుగుభాషా దినోత్సవం అని ఎమ్మెల్సీ రాము సూర్యారావు అన్నారు. స్థానిక సమాచార శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు 155వ జయంతి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజల కోసం రాసే రచనలన్నీ, వ్యవహారిక భాషలోనే ఉండాలంటూ గిడుగు వెంకటరామ్మూర్తి వ్యవహారిక భాషోద్యమం నడిపారని వివరించారు. గిడుగు స్ఫూర్తితో తెలుగుభాషను బతికించుకోవాలన్నారు. సమాచారశాఖ ఏడీ వి.భాస్కర నరసింహం మాట్లాడుతూ తెలుగు భాషోద్యమంలో గిడుగు పిడుగులా పనిచేశారన్నారు. డీపీఆర్వో ఆర్‌వీఎస్ రామచంద్రరావు, ఏపీఆర్ఓ కె.దుర్గాప్రసాద్ లింగం, సమాచారశాఖ ఉద్యోగుల సంఘం కార్యదర్శి పులి వినాయకబాబు, రాజు, సాగర్, దుర్గారావు, గంగాజలం, మల్లిబాబు, వెంకటలక్ష్మి, ఆయేషా, మల్లేశ్వరి, రామలింగేశ్వరరావు, నాగేశ్వరరావు, సురేష్‌కుమార్, రాజేష్‌బాబు పాల్గొన్నారు.


గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సూర్యారావు

పీతల పెంపకానికి డిమాండ్

నరసాపురం రూరల్ : అంతర్జాతీయంగా పీతల పెంపకానికి మంచి డిమాండ్ ఉందని మత్స్యశాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఫణిప్రకాష్ అన్నారు. మండలంలోని తూర్పుతాళ్లు చామకూరిపాలెం ప్రాథమిక పాఠశాల వద్ద మంగళవారం రెండో అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటికే బంగ్లాదేశ్, ఇండియా, థాయ్‌లాండ్, ఫిలిప్పైన్స్ తదితర దేశాల్లో పీతల సాగు ప్రాచుర్యం పొందిందన్నారు. మండపీత (సిల్లా సెర్రేట్రా) పెరుగుదల రుచి, మార్కెట్ ధర అధికంగా ఉండడం వల్ల పెంపకానికి రైతులు ఆసక్తి కనబరుస్తున్నారని తెలిపారు. రొయ్యల సాగుకు ప్రత్యామ్నాయంగా పీతల సాగుకు తీరప్రాంత గ్రామాలు అనుకూలమన్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ శ్రమ లేకుండా లాభాలు ఆర్జించవచ్చని వివరించారు. రాష్ట్రంలో పీతల హేచరీని గుంటూరు జిల్లా సూర్యలంకలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. నీటి నాణ్యత, పీతలు సాగు విధానాన్ని రిటైర్డ్ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రామ్మోహనరావు, ఎంపెడా ఏడీ పట్నాయక్ తదితరులు వివరించారు. జిల్లాలో 400 హెక్టార్లలో పీతలు, పండుగప్ప సాగవుతున్నట్టు చెప్పారు. సదస్సులో ఎంపీటీసీ పుచ్చకాయల తిరుపతమ్మ, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎ.అప్పలరాజు, రమణకుమార్, అభివృద్ధి అధికారులు ఎల్ఎన్ఎన్ రాజు, వి.సత్యనారాయణ, ఏడీ ఏడుకొండలు, ప్రతిభ, ఎంపీఈఏలు, పలువురు రైతులు పాల్గొన్నారు.

థర్మల్ టెక్నాలజీతో మలం శుద్ధిప్లాంట్లు

- ప్రయోగాత్మకంగా నరసాపురం, కొవ్వూరు, పాలకొల్లులో ఏర్పాటు
- అక్టోబర్‌లో నరసాపురంలో అంతర్జాతీయ స్థాయి సదస్సు
- ఏపీ స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీఎల్ వెంకటరావు

కొవ్వూరు : థర్మల్ టెక్నాలజీలో మలం శుద్ధి చేసే ప్లాంటులను దేశంలోనే ప్రయోగాత్మకంగా నరసాపురం, పాలకొల్లు, కొవ్వూరులో నెలకొల్పనున్నట్టు ఏపీ స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ సీఎల్ వెంకట్రావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన కొవ్వూరు విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 21న నరసాపురంలో ట్రయిల్ రన్ వేశామని, ప్లాంటు ఏర్పాటుకు అవసరమైన స్థలం కేటాయించారని తెలిపారు. కొవ్వూరు, పాలకొల్లులో స్థలం కేటాయిస్తే రూ.1.20 కోట్లతో 60 రోజుల్లో ప్లాంట్ ఏర్పాటుచేస్తామన్నారు. కొవ్వూరులో ఎకరం స్థలం అవసరమన్నారు. థర్మల్ టెక్నాలజీలో మలాన్ని 700 డిగ్రీల ఉష్ణోగ్రతలో మండించడం ద్వారా బ్యాక్టీరియా, వైరస్‌లన్నీ నశించి ఫ్లైయాస్ మాదిరిగా తయారవుతుందని, దీనిని పంటలకు ఉపయోగపడే ఎరువుగా మార్చుతామని వివరించా రు. ఈ మూడు పట్టణాల్లో విజయవంతమైతే రాష్ట్రంలోని 110 మునిసిపాలిటీల్లో ఈ ప్లాంట్లను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. అక్టోబర్‌లో నరసాపురంలో జర్మనీ, ఫ్రాన్స్, మలేషియా, సింగపూర్, అమెరికా, కెనడా దేశ ప్రతినిధులతో జాతీయ, అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తామన్నారు. కొవ్వూరు రైల్వే స్టేషన్‌కి విచ్చేసిన ఆయనకు మునిసిపల్ చైర్‌పర్సన్ జొన్నలగడ్డ రాధారాణి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, వైస్ చైర్మన్ దుద్దుపూడి రాజారమేష్, మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని తదితరులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించారు.


మాట్లాడుతున్న ఏపీ స్వచ్ఛ ఆంధ్రమిషన్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ వెంకట్రావు

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం

దేవరపల్లి : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ భక్తుడు మంగళవారం రూ. 1,01,116 విరాళంగా అందించారు. మచిలీపట్నంకు చెందిన బి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ధనలక్ష్మి దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా విరాళాన్ని నిత్యాన్నదాన భవనంలో జమచేశారు. వారికి ఆలయ ఏఈఓ బొమ్మకంటి రామాచారి దాతకు విరాళం బాండ్‌ను అందజేశారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



చెరుకువాడలో కవి ఎస్‌కే నాగేశ్వరరాను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

పెనుగొండ : తెలుగు భాషా దినోత్సవాన్ని పెనుగొండలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్‌రాజు కళాశాల, చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విశ్వతేజ డిగ్రీ కళాశాల, భాష్యం పాఠశాలలోనూ ఘనంగా నిర్వహించారు. గడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చెరుకువాడలో కవి, రచయిత ఎన్‌కే నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. భాష్యం పాఠశాలలో చిన్నారులు తెలుగు వీరుల వేషధారణలో అలరించారు.

అశాంతిని సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి

- పెనుగొండ పంచాయతీ సభ్యులు



పెనుగొండ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పంచాయతీ సభ్యులు

పెనుగొండ : అర్ధరాత్రి వేళ జాతీయ నాయకుల విగ్రహాలు పెట్టి, వారి గౌరవానికి భంగం వాటిల్లే విధంగా వ్యవహరించిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పెనుగొండ పంచాయతీ సభ్యులు పెనుగొండ సీఐ జి.సత్యనారాయణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడానికి ప్రయత్నించారని పోలీసులకు వివరించారు. సమస్యను సృష్టించి జాతీయ నాయకులను అవమానించారన్నారు. అనుమతులు తీసుకోకుండా అశాంతిని సృష్టించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వాయిదా వేస్తున్నట్లు ప్రకటించలేదు

సమస్యను సామరస్యంగా పరిష్కరించడానికి పంచాయతీ రాజ్ చట్టంపై అధికారులతో చర్చిస్తుంటే అత్యవసర సమావేశాన్ని వాయిదావేస్తున్నట్లు కనీసం ప్రకటించకుండా సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి నిష్క్రమించారని పంచాయతీ సభ్యులు విలేకరుల సమావేశంలో ఆరోపించారు. సభ్యుల అభిప్రాయాన్ని మినిట్స్ బుక్‌లో నమోదు చేయకుండా, సభ్యుల అభిప్రాయాలు, అధికారుల వివరణలు వినకుండా వెళ్లిపోవడం దారుణమన్నారు. దీంతో ఉప సర్పంచ్ నూలి ధీరజ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించి తీర్మానం ఆమోదించడం జరిగిందని తెలిపారు. సమావేశంలో 12 మంది పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా డ్రెయినేజీ నిర్మాణం పనులు

ఆచంట : ఆచంట గ్రామం చూట్టూ ఆవరించి ఉన్న మురుగు డ్రెయిన్ నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంపట్ల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వైట్ల కిషోర్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కాంక్రీటు నిర్మాణంతో కూడిన డ్రెయినేజీ కోసం ప్రభుత్వం సుమారు ఆరు కోట్ల రూపాయలు మంజూరు చేసిందని ఆయన అన్నారు. అయితే స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సుమారు 100 మీటర్ల మేర, చినపేట నుంచి మరో 100 మీటర్లు పనులు పూర్తి చేసిందన్నారు. మురుగు డ్రెయిన్ వల్ల దోమలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు రోగాల బారిన పడతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి అసంపూర్తిగా ఉన్న మురుగుడ్రెయిన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆయన కోరారు.

చెల్లింపుల్లో నిర్లక్ష్యం.. నిర్మాణాలు జాప్యం!



ఎ.వేమవరంలో అసంపూర్తిగా నిలిచిన నిర్మాణాలు



ఆచంటలో ఇలా...

- ఆచంట, ఎ.వేమవరం గ్రామాల్లో అసంపూర్తిగా ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలు
- నాలుగేళ్లుగా సా..గుతున్న పనులు

ఆచంట :

సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల నిర్మాణాలపై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడంలో జాప్యం చేస్తుండడంతో నిర్మాణాలు నత్తనడక సాగుతున్నాయి. ఆచంట మండలంలో ఇంటిగ్రేటెడ్ వసతిగృహాల నిర్మాణాలు ఏడాదిన్నరగా నిలిచిపోయాయి. వివరాల్లోకి వెళితే ఆచంట మండలంలో తొమ్మిది వసతి గృహాలు ఉండేవి. ఆయా వసతి గృహాల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన దాదాపు 350 మంది విద్యార్థినీవిద్యార్థులు చదువుకునే వారు. అయితే విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే నెపంతో రెండేళ్ల క్రితం ప్రభుత్వం ఏడు వసతి గృహాలను మూసివేసింది. ప్రస్తుతం ఆచంటలో బాలురకు, వల్లూరులో బాలికలకు ఒక్కొక్కటి చొప్పున మాత్రమే నిర్వహిస్తోంది. వసతి గృహాల ఎత్తివేతపై వివిధ ప్రజా సంఘాల నాయకుల నుంచి ఆందోళనలు వ్యక్తమైన సందర్భంలో ఆచంట, వేమవరం గ్రామాల్లో త్వరలోనే సకల సౌకర్యాలతో ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలు అందుబాటులోకి వస్తున్నాయని అధికారులు మభ్యపెట్టారు.

రూ.6.50 కోట్లతో వసతిగృహాలు..

ఆచంట, ఎ.వేవమవరం గ్రామాల్లో ఒక్కో ఇంటిగ్రేటెడ్ వసతి గృహానికి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నుంచి రూ.3.25 కోట్లు మంజూరు చేసింది. ఆయా భవనాలకు 2013లో శంకుస్థాపన చేశారు. ఒక్కో వసతి గృహంలో దాదాపు 300 మంది విద్యార్థుల వరకూ వసతి సమకూరేలా నిర్మాణాలు రూపొందించారు. అయితే నాలుగేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకూ 60 శాతం పనులు కూడా పూర్తి కాలేదంటే పనులు ఏస్థాయిలో జరుగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వసతి గృహాలు అందుబాటులోకి వస్తాయని తల్లిదండ్రులు చూస్తున్న ఎదురుచూపులు ప్రభుత్వానికి పట్టడంలేదు. ఒక పక్క భవనాల పరిస్థితి ఈ విధంగా ఉంటే నిర్మాణాలు సాకుగా చూపి నడిచే వసతిగృహాలను ఎత్తివేశారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

రూ. 70 లక్షలకు పైనే బిల్లులు పెండింగ్..

ఆచంట, ఎ.వేమవరం గ్రామాల్లో నిర్మించే భవనాలకు ఒక్కరే కాంట్రాక్టరు. ఆయా భవన నిర్మాణాలకు సంబంధించి కాంట్రాక్టరుకు ఇప్పటి వరకూ దాదాపు రూ.70 లక్షలకు పైనే బిల్లులు చెల్లించవలసి ఉంది. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో సదరు కాంట్రాక్టరు ఏడాది కాలంగా పనులు నిలిపివేశారు. ఒక పక్క ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వం ఆచరణలో కాస్తయినా శ్రద్ధ చూపడంలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి వసతి గృహాల నిర్మాణాలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంచాయతీ తీరుపై ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ ఆశాజ్యోతి



ఉప సర్పంచ్ ధీరజ్ అధ్యక్షతన పంచాయతీ తీర్మానం చేస్తున్న సభ్యులు

- జాతీయ నాయకులకు అవమానం
- పాలకవర్గ సభ్యుల ఆరోపణ
- పార్కు వద్ద ఏర్పాటుకు తీర్మానం

పెనుగొండ : దళిత సంఘాల విజ్ఞప్తి మేరకు జాతీయ నాయకుల విగ్రహల పునఃప్రతిష్ట కోసం ఏర్పాటుచేసిన మంగళవారం పెనుగొండ పంచాయతీ అత్యవసర సమావేశం ఆది నుంచి ఉత్కంఠను రేపింది. సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగానే, సభ్యులు తీవ్ర విమర్శలు చేశారు. అంబేడ్కర్‌ను అవమానించే విధంగా పంచాయతీ వ్యవహరించిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా సభ్యులను సమావేశపరచి నిర్ణయాలు తీసుకోకుండా సమస్యను జఠిలం చేసి సమావేశం ఏర్పాటు చేశారని ఆరోపించారు. అర్ధరాత్రి వేళ జాతీయ నాయకుల విగ్రహాలు పెట్టి అవమానించే విధంగా, విద్వేషాలు రెచ్చగొట్టేవిధంగా వ్యవహరించిన వారిపైనా ఫిర్యాదు చేయాలంటూ పట్టుబట్టారు. సర్పంచ్ ఆశాజ్యోతి మాట్లాడుతూ పంచాయతీ ఎజెండాలో పొందుపరిచిన తీర్మానంపై మాత్రమే అభిప్రాయాలు చెప్పాలని పట్టుబట్టడంతో, ఒప్పందం ప్రకారం ముందుగా నిర్ణయించినట్లుగా తీర్మానం చేయాలని సభ్యులు పట్టుబట్టారు.దీంతో సమావేశాన్ని సర్పంచ్ వాయిదా వేసి వెళ్లిపోయారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

కాగా, చర్చ జరుగుతుండగానే సర్పంచ్ ఆశాజ్యోతి సమావేశం నుంచి వెళ్లిపోవడం తగదని ఆరోపిస్తూ ఉప సర్పంచ్ నూలి ధీరజ్ అధ్యక్షతన 12 మంది పంచాయతీ సభ్యులు ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రభుత్వ స్థలాల్లో అనుమతులు లేకుండా ఉన్న విగ్రహాలతో పాటు, ఇటీవల తొలగించిన జాతీయ నాయకుల విగ్రహాలు పంచాయతీ పార్కు వద్ద ఏర్పాటుచేయాలని తీర్మానం ఆమోదించారు. భవిష్యత్తులో పంచాయతీ అనుమతులు లేకుండా గ్రామంలో ఎటువంటి విగ్రహాలు ఏర్పాటు చేయకూడదని, అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి తీర్మానం చేశారు. సమావేశంలో పంచాయతీ సభ్యులు చలుమూరి తులసీ అన్నపూర్ణ, శింగంశెట్టి రామ తులసి, ఎ.లక్ష్మి, వి.పార్వతి, పెచ్చెట్టి వరలక్ష్మి, సీహెచ్ సత్యవతి, కె.సత్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, సూర్నిడి కోటేశ్వరరావు, ఎస్.అయ్యన్న, తిరుపతి వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఎన్నిసార్లు చెప్పినా సభ్యులు వినలేదు

- పంచాయతీ అత్యవసర సమావేశం వాయిదాపై పెనుగొండ సర్పంచ్

పెనుగొండ: పంచాయతీ అత్యవసర సమావేశంలో ఎజెండాలోని అంశం మాత్రమే చర్చించాలని ఎన్నిసార్లు చెప్పినా పంచాయతీ సభ్యులు వినకుండా వారు రాసుకొన్న విధంగానే తీర్మానం చేయాలని పట్టుబట్టి వాగ్వాదానికి దిగడం వలనే సమావేశం వాయిదా వేసినట్లు పెనుగొండ సర్పంచ్ యాదాల ఆశాజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తొలగించిన విగ్రహాలు పునఃప్రతిష్టించాలని వివిధ సంఘాలు అభ్యర్థన మేరకు, తహసీల్దారు దరఖాస్తు మేరకు సమావేశం ఏర్పాటు చేశామని సర్పంచ్ అన్నారు. సభ్యులు కోరిన విధంగా అభ్యర్థన లేఖ ఇస్తే తదుపరి సమావేశం నిర్వహించి చర్యలు తీసుకోవచ్చునన్న వినిపించుకోలేదన్నారు. దీంతో సమావేశం వాయిదా వేయడం జరిగిందని వివరించారు. అయితే, పంచాయతీ చట్టానికి వ్యతిరేకంగా ఉప సర్పంచ్ చేత మినిట్స్ బుక్‌లో తీర్మానం రాయించడానికి రికార్డు అప్పగించినందుకు కార్యదర్శి బాధ్యత వహించాల్సి ఉంటుందని సర్పంచ్ అన్నారు.

12 మంది మాలమహానాడు నాయకుల అరెస్టు

ఆచంట : పెనుగొండ గాంధీబొమ్మల సెంటరులో తొలగించిన విగ్రహాలను యథాస్థానంలో ఉంచాలని కోరుతూ మంగళవారం పెనుగొండకు ర్యాలీగా తరలివెళుతున్న మాల మహానాడు నాయకులను ఆచంట పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా 12 మందిని అరెస్టు చేసి అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మాలమహానాడు జిల్లా నాయకుడు నన్నేటి పుష్పరాజు, మండల అధ్యక్షుడు రావినాగరాజు, దొడ్డి దుర్గారావు తదితరులు ఉన్నారు.

వెండితెర

ఆచంట	
కల్యాణచక్రవర్తి	: జయజానకి నాయక
పెనుగొండ	
మినర్వా	: నేనే రాజు నేనే మంత్రి
వల్లూరు	
విజయకృష్ణ	: వివేకం, ఆనందోబ్రహ్మ

తొలి రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేసిన కేసు?



కొప్పుల మల్లేశం
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ కళాశాల.

జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. స్వాతంత్ర్యానంతరం తొలి భాషాప్రయుక్త రాష్ట్రం ఏ సంవత్సరంలో ఏర్పడింది?
1) 1948 2) 1953
3) 1955 4) 1956

2. భారత్, బ్రిటిష్ రాజ్యాంగాల్లో ఉండే సాధారణ అంశాలు ఏవి?
ఎ) సమన్యాయ పాలన
బి) ఏక పౌరసత్వం
సి) డాక్ట్రిన్ ఆఫ్ ప్లెజర్
డి) తాత్కాలిక సభాధ్యక్షుడు
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

3. జమ్ము-కశ్మీర్ రాష్ట్రానికి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
1) అసెంబ్లీ పదవీ కాలం ఆరేళ్లు
2) గవర్నర్ కనీస వయసు 30 ఏళ్లు
3) విధాన పరిషత్ సభ్యుల సంఖ్య - 36
4) తొలిసారి రాష్ట్రపతి పాలన - 1984

4. భారతదేశంలో ప్రధానమంత్రి అధికారం కింద పేర్కొన్న ఏ సందర్భంలో బలహీనమవుతుంది?
1) సంకీర్ణ ప్రభుత్వం వల్ల
2) పార్లమెంటరీ ప్రభుత్వం వల్ల
3) ఏక పార్టీ ఆధిపత్యం వల్ల
4) అత్యవసర అధికారాల వల్ల

5. భారత రాజ్యాంగం ప్రకారం, బలహీన వర్గాలకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అనేవి..?
1) ఆదేశిక సూత్రాలు
2) సంక్షేమ సూత్రాలు
3) ప్రాథమిక హక్కులు
4) పౌరహక్కులు

6. భారతదేశంలో 'నిర్ణయీకరణ'కు అత్యున్నత వేదిక ఏది?
1) సుప్రీంకోర్టు
2) పార్లమెంట్ 3) రాజకీయ పార్టీలు
4) గ్రామసభ

7. భారత పార్లమెంట్‌ను రాష్ట్రపతి 'ప్రోరోగ్' చేస్తారు. దీని అర్థం?
1) లోక్‌సభను రద్దు చేయడం
2) పార్లమెంట్‌ను సమావేశ పరచడం
3) పార్లమెంట్ సమావేశాలను ముగించడం
4) పార్లమెంట్‌ను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించడం

8. రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం, రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే అధికారం సుప్రీంకోర్టుకు ఉంది?
1) 142 2) 144
3) 146 4) 147

9. భారత రాజ్యాంగంలో 'పీఠిక' అనేది?
1) షెడ్యూళ్లలో అంతర్భాగం
2) భాగాల్లో అంతర్భాగం
3) ఆర్టికళ్లలో అంతర్భాగం
4) రాజ్యాంగంలో ప్రత్యేకంగా ఉండే అంతర్భాగం

10. దేశంలో అతిపెద్ద హైకోర్టు 'అలహాబాద్ హైకోర్టు' ఏ సంవత్సరంలో ఏర్పడింది?
1) 1866 2) 1871
3) 1884 4) 1862

11. రాష్ట్ర స్థాయిలో విధాన సభ ఆమోదించిన సాధారణ బిల్లును విధాన పరిషత్ గరిష్టంగా ఎంతకాలం జాప్యం చేయగలుగుతుంది?
1) ఒక నెల 2) మూడు నెలలు
3) నాలుగు నెలలు 4) ఆరు నెలలు

12. మండల సంఘాలు (జోనల్ కౌన్సిల్స్) అనేవి?
1) రాజ్యాంగబద్ధమైనవి
2) సలహా సంఘాలు
3) కార్య నిర్వాహక సంస్థలు
4) శాసనపర సంస్థలు

13. రాజ్యాంగ సవరణ మొదటగా ఎక్కడ నుంచి ప్రారంభమవుతుంది?
1) రాజ్యసభలో 2) లోక్‌సభలో
3) రాజ్యసభలో లేదా లోక్‌సభలో
4) రాజ్యసభలో, లోక్‌సభలో లేదా రాష్ట్ర శాసనసభలో

14. జాతీయ వేతన సవరణ కమిషన్ మొదటి చైర్మన్ ఎవరు?
1) రవీంద్ర వర్మ
2) వి.టి. కృష్ణమాచారి
3) ఎస్.ఎన్. ముఖర్జీ
4) వరదాచారి అయ్యర్

15. కింది వాటిలో నిర్ణీత కాల పరిమితి లేని పదవి ఏది?
1) అటార్నీ జనరల్
2) యూపీఎస్సీ చైర్మన్
3) కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్
4) ప్రధాన ఎన్నికల కమిషనర్

16. జిల్లా కలెక్టర్ ఏ శాఖ పరిధిలోకి వస్తాడు?
1) రెవెన్యూ 2) ఫైనాన్స్
3) ప్రణాళిక శాఖ
4) సాధారణ పరిపాలన శాఖ

17. కింది వాటిలో ప్రాథమిక హక్కు ఏది?
1) ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు
2) ఎస్సీ, ఎస్టీలకు లోక్‌సభ, అసెంబ్లీల్లో రిజర్వేషన్లు
3) ఎస్సీ, ఎస్టీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు
4) పైవన్నీ

18. కేంద్ర, రాష్ట్రాల సంబంధాల పునఃపరిశీలనకు ఎం.ఎం. పూంఛీ కమిషన్‌ను వేసిన ప్రధాని ఎవరు?
1) అటల్ బిహారీ వాజ్‌పేయి
2) మన్మోహన్ సింగ్
3) వి.పి. సింగ్ 4) దేవెగౌడ

19. కింది వారిలో 1966లో తాష్కెంట్ ఒప్పందంపై సంతకాలు చేసిందెవరు?
1) ఎల్.బి. శాస్త్రి, జుల్ఫికర్ అలీభుట్టో
2) ఎల్.బి. శాస్త్రి, ఆయూబ్ ఖాన్
3) ఇందిరాగాంధీ, జుల్ఫికర్ అలీ భుట్టో
4) ఇందిరాగాంధీ, ఆయూబ్ ఖాన్

20. లోక్‌సభకు తొలిసారి 'హంగ్' ఏ సంవత్సరంలో ఏర్పడింది?
1) 1977 2) 1971
3) 1989 4) 1991

21. కింది వాటిలో హైకోర్టు లేని నగరం ఏది?
1) రాంచీ 2) బిలాస్‌పూర్
3) డెహ్రాడూన్ 4) అహ్మదాబాద్

22. 'ఆపరేషన్ విజయ్' ద్వారా భారత్‌లో విలీనమైన రాష్ట్రం?
1) పుదుచ్చేరి 2) సిక్కిం
3) గోవా 4) జమ్ము-కశ్మీర్

23. కింది వారిలో భారత్‌లో వైస్రాయ్, గవర్నర్ జనరల్‌గా పనిచేసిన వారెవరు?
1) లార్డ్ కానింగ్, లార్డ్ రీడింగ్
2) లార్డ్ కానింగ్, మౌంట్ బాటెన్
3) మౌంట్ బాటెన్, లార్డ్ రీడింగ్
4) లార్డ్ వెల్లింగ్టన్, లార్డ్ మెకాలే

24. కొంతమంది విధాన పరిషత్ సభ్యులను విధాన సభ సభ్యులు ఎన్నుకునే విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
1) జర్మనీ 2) దక్షిణాఫ్రికా
3) నార్వే 4) ఫ్రాన్స్

25. రాజ్యాంగాన్ని అధికారికంగా హిందీ, అరబిక్ భాషల్లోకి తర్జుమా చేసిన సంవత్సరాలు వరుసగా?
1) 1987, 2007 2) 1987, 2014
3) 1997, 2014 4) 1997, 2007

26. 1946లో భారతదేశంలో తాత్కాలిక ప్రభుత్వం దేని ప్రకారం ఏర్పడింది?
1) రాజాజీ ఫార్ములా
2) వేవెల్ ప్లాన్
3) కేబినెట్ మిషన్ ప్లాన్
4) మౌంట్ బాటెన్ ప్లాన్

27. "Constitution Government in India" గ్రంథ రచయిత ఎవరు?
1) బార్కర్ 2) గ్రాన్‌విల్ ఆస్టిన్
3) జె.ఆర్. శివాక్ 4) ఎం.వి. పైలీ

28. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సర్వీసు నిబంధనలను తెలిపే ఆర్టికల్ ఏది?
1) 307 2) 309
3) 314 4) 317

29. కొత్తగా ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తే సవరించాల్సిన షెడ్యూళ్లు ఏవి?
1) 1, 2 2) 1, 3
3) 1, 4 4) 1

30. భారత రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో ఉన్న 22 భాషల్లో కింది వాటిలో లేని భాషలు?
1) ఇంగ్లిష్, రాజస్థానీ
2) కశ్మీరీ, ఉర్దూ
3) సంస్కృతం, కొంకణి
4) డోగ్రీ, సంతాలీ

31. భారత రాజ్యాంగంలో అంతర్రాష్ట్ర వ్యాపారం గురించి ఏ భాగంలో పేర్కొన్నారు?
1) 12 2) 13
3) 14 4) 15

32. రాజకీయ పార్టీలు, అవి ఏర్పడిన సంవత్సరాల సరైన వరస క్రమం ఏది?
ఎ) డి.ఎం.కె బి) అకాలీదళ్
సి) శివసేన డి) నేషనల్ కాన్ఫరెన్స్
1) బి, సి, ఎ, డి 2) ఎ, బి, డి, సి
3) బి, డి, ఎ, సి 4) బి, ఎ, సి

33. కింద పేర్కొన్న ఏయే సంవత్సరాల్లో మనదేశం అణు ప్రయోగం నిర్వహించింది?
1) 1974, 1996 2) 1976, 1996
3) 1974, 1998 4) 1976, 1998

34. ఆర్టికళ్లకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
1) బిరుదుల నిషేధం – ఆర్టికల్ 18
2) బాల కార్మిక వ్యవస్థ నిషేధం – ఆర్టికల్ 23
3) మద్యపాన నిషేధం – ఆర్టికల్ 47
4) వివక్షత నిషేధం – ఆర్టికల్ 15

35. భారత రాష్ట్రపతికి ఏ బిల్లుల విషయంలో నిరపేక్ష వీటో అధికారం ఉంటుంది?
1) పబ్లిక్ బిల్లులు
2) ప్రైవేట్ బిల్లులు 3) సాధారణ బిల్లులు
4) పైవన్నీ

36. 'పోటా' బిల్లు విషయంలో పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశానికి అధ్యక్షత వహించిన వారెవరు?
1) జి.ఎం.సి. బాలయోగి
2) పి.ఎ. సంగ్మా 3) పి.ఎం. సయీద్
4) మనోహర్ జోషీ

37. ఆర్టికల్ 360 ప్రకారం, రాష్ట్రపతి విధించే ఆర్థిక అత్యవసర పరిస్థితి గరిష్ట కాల పరిమితి?
1) ఏడాది 2) రెండేళ్లు
3) మూడేళ్లు 4) అనిశ్చితం

38. అతి ఎక్కువ వయసులో భారత ప్రధాని అయిన వ్యక్తి?
1) చరణ్‌సింగ్ 2) మొరార్జీ దేశాయ్
3) అటల్ బిహారీ వాజ్‌పేయి
4) చంద్రశేఖర్

39. "A Foreign Policy of India" పుస్తక రచయిత ఎవరు?
1) ఐ.కె. గుజ్రాల్ 2) వి.పి. సింగ్
3) జవహర్ లాల్ నెహ్రూ
4) దేవెగౌడ

40. మైనారిటీ ప్రభుత్వం అంటే?
1) మైనారిటీలకు ప్రాధాన్యం ఇచ్చేది
2) మైనారిటీలు అధికారం చేపట్టడం
3) సాధారణ మెజారిటీ కూడా లేని ప్రభుత్వం
4) సంకీర్ణ ప్రభుత్వానికి మరోపేరు

41. కింది వాటిలో ఇప్పటి వరకు తెలుగువారు చేపట్టని పదవులు ఏవి?
ఎ) లోక్‌సభ స్పీకర్
బి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
సి) ఉపరాష్ట్రపతి
డి) ఉప ప్రధానమంత్రి
1) బి, డి 2) ఎ, బి
3) ఎ, డి 4) డి

42. పార్లమెంట్‌లో నిర్వహించే 'జీరో అవర్'ను ఏ సంవత్సరం నుంచి ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు?
1) 1994 2) 2004
3) 2008 4) 2010

43. పండిట్ గోవింద్ వల్లభ్ పంత్ పేరుతో ఇచ్చే 'ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు' పొందిన ఏకైక మహిళ ఎవరు?
1) ఇందిరాగాంధీ 2) మీరాకుమార్
3) సుమిత్రా మహాజన్
4) సుష్మా స్వరాజ్

44. ప్రత్యేక సెలవుతో కూడుకున్న వివాదాల (SLP) గురించి తెలిపే ఆర్టికల్ ఏది?
1) 134 2) 136
3) 137 4) 138

45. తొలి రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాల్ చేసిన కేసు?
1) చంపకం దొరై రాజన్ కేసు
2) ఎ.కె. గోపాలన్ కేసు
3) బెలా బెనర్జీ కేసు
4) శంకరీ ప్రసాద్ కేసు

46. 'మంత్రాలయం' అని ఏ రాష్ట్ర సచివాలయ భవనాన్ని పిలుస్తారు?
1) మధ్యప్రదేశ్ 2) మహారాష్ట్ర
3) కర్ణాటక 4) ఉత్తరప్రదేశ్

47. 'ఉన్నత విద్యా పరిశోధన' ఏ జాబితాలోని అంశం?
1) కేంద్ర జాబితా 2) రాష్ట్ర జాబితా
3) ఉమ్మడి జాబితా 4) అవశిష్ట అంశం

48. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్(కాగ్) నివేదిక 'శవపరీక్ష' లాంటిదని విమర్శించిన వారెవరు?
1) వి.కె. షుంగ్లూ 2) పాల్ ఆపిల్ బీ
3) సి.జి. సోమయ్య
4) ఎం.పి. శర్మ

49. స్థానిక సంస్థల్లో మహిళలకు 50% రిజర్వేషన్లు కల్పించిన తొలి రాష్ట్రం ఏది?
1) రాజస్థాన్ 2) మధ్యప్రదేశ్
3) కేరళ 4) బిహార్

50. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ ఏ సంవత్సరంలో అమల్లోకి వచ్చింది?
1) 2010 2) 2011
3) 2012 4) 2013

సమాధానాలు

1) 2	2) 2	3) 4	4) 1	5) 3
6) 2	7) 3	8) 4	9) 4	10) 1
11) 3	12) 2	13) 3	14) 4	15) 1
16) 4	17) 1	18) 2	19) 2	20) 3
21) 3	22) 3	23) 2	24) 3	25) 2
26) 3	27) 4	28) 2	29) 3	30) 1
31) 2	32) 3	33) 3	34) 2	35) 2
36) 3	37) 4	38) 2	39) 1	40) 3
41) 4	42) 2	43) 4	44) 2	45) 4
46) 2	47) 1	48) 2	49) 4	50) 3



N. Vijayender Reddy

GENERAL AWARENESS

1. Union Home Minister Rajnath Singh attended a meeting of the Shanghai Cooperation Organization (SCO) on disaster prevention and relief held in August 2017 in Cholpon Ata, a resort town in:
1) Kazakhstan 2) Tajikistan
3) Kyrgyzstan 4) Uzbekistan
5) None of these
2. Who was sworn in as the 45th Chief Justice of India on August 28, 2017?
(He succeeded Justice J.S. Khehar)
1) Justice Deepak Gupta
2) Justice Dipak Misra
3) Justice Arun Mishra
4) Justice Ranjan Gogoi
5) Justice Kurian Joseph
3. Who won the 2017 Mark Twain Prize for American Humor?
(It is awarded by the John F. Kennedy Center for the Performing Arts)
1) Bill Murray
2) Eddie Murphy
3) David Letterman
4) Neil Simon
5) None of these
4. Where was the 2017 Global Platform for Disaster Risk Reduction held?
1) Geneva, Switzerland
2) New York, USA
3) Cancun, Mexico
4) Havana, Cuba
5) Nairobi, Kenya
5. Prime Minister Narendra Modi laid the foundation stone of the Indian Agricultural Research Institute (IARI) on May 26, 2017 at Gogamukh in:
1) Bihar
2) Odisha 3) West Bengal
4) Assam
5) Arunachal Pradesh
6. Who was the winner of the first ever genderless award at the MTV Movie & TV Awards in May 2017?
1) Emma Stone
2) Megan Fox
3) Emma Watson
4) Anne Hathaway
5) Natalie Portman
7. Who is the first Bollywood actor to speak at the TED Talks?
(TED stands for Technology, Entertainment and Design)
1) Akshay Kumar
2) Shah Rukh Khan
3) Aamir Khan
4) Amitabh Bachchan
5) None of these
8. The Organization of American States (OAS) is headquartered in:
1) Ottawa 2) Santiago
3) Mexico City
4) Washington, D.C.
5) Buenos Aires
9. Which country announced its intention to withdraw from the Organization of American States in April 2017?
1) Bolivia 2) Cuba
3) Venezuela 4) Costa Rica
5) Ecuador
10. Donald Trump became the first sitting US President to visit the Western Wall in May 2017. It is a holy site located in:
1) Israel 2) Vatican
3) Saudi Arabia
4) Germany 5) Italy
11. S. Ramassamy passed away on May 15, 2017. He was the former Chief Minister of:
1) Kerala 2) Puducherry
3) Tamil Nadu 4) Goa
5) Karnataka
12. The United Nations Organization has established a medal in recognition and commemoration of those who have lost their lives as a result of UN peacekeeping operations. It is named after which of the following Secretaries-General of the UNO?
1) Trygve Lie
2) Dag Hammarskjold
3) U Thant
4) Kurt Waldheim
5) Boutros Boutros-Ghali
13. The International Day of United Nations Peacekeepers is celebrated on:
1) March 29 2) April 29
3) May 29 4) June 29
5) July 29
14. Jonathan Demme passed away recently. He won the Academy Award for Best Director in 1991 for which of the following films?
1) Philadelphia
2) Beloved
3) A Master Builder
4) The Silence of the Lambs
5) Rachel Getting Married
15. Who became the first woman to climb Mount Everest eight times in May 2017?
1) Maya Gurung
2) Pema Diki Sherpa
3) Lhakpa Sherpa
4) Nimdoma Sherpa
5) Pujan Acharya
16. Which is the first country to have national plan for disaster risk reduction?
1) Australia 2) Canada
3) UK 4) India
5) Mexico



BANK POs, Clerks & Groups

17. Who has been appointed as the Director General of the Indo-Tibetan Border Police (ITBP)?
1) R.K. Pachnanda
2) Rajiv Jain
3) K. Durga Prasad
4) Anil Dasmana
5) Rajiv Rai Bhatnagar
18. Which former Union Minister is the author of the book "Hope in a Challenged Democracy: An Indian Narrative"?
1) Natwar Singh
2) Jairam Ramesh
3) P. Chidambaram
4) Ashwani Kumar
5) Jaswant Singh
19. The 15th edition of Indo-French naval exercise was held in April 2017. It is known as:
1) Indra 2) Yudh Abhyas
3) Varuna 4) Sampreeti
5) Konkan
20. Which of the following days was celebrated on April 22, 2017?
1) Science Day
2) Earth Day
3) Technology Day
4) Diabetes Day
5) None of these
21. Who received the P.C. Chandra Puraskar in April 2017?
1) Kailash Satyarthi
2) Gulzar
3) Sourav Ganguly 4) Rekha
5) Hema Malini
22. Which of the following countries currently has an Indian-Origin Prime Minister?
1) Canada 2) Ireland
3) Poland 4) Australia
5) New Zealand
23. Which State government has signed a Memorandum Of Understanding (MOU) with IIT Kharagpur for the development of a Happiness Index?
1) Punjab 2) Haryana
3) Madhya Pradesh
4) Andhra Pradesh
5) West Bengal
24. Hubert Minnis was elected as the new Prime Minister of which of the following countries in May 2017?
1) Haiti 2) Cuba
3) Panama 4) Bahamas
5) Dominican Republic
25. Kumarakom Bird Sanctuary is situated in which of the following States?
1) Tamil Nadu
2) Kerala 3) Goa
4) Karnataka
5) Rajasthan
26. Who was crowned Miss teen Universe 2017 in Managua, the capital city of Nicaragua?
1) Samantha Pierre (Canada)
2) Ary Trava (Mexico)
3) Srishti Kaur (India)
4) Nicole Obando (Costa Rica)
5) None of these
27. Who is the Present Prime Minister of France?
1) Emmanuel Macron
2) Edouard Philippe
3) Bernard Cazeneuve
4) Manuel Valls
5) Francois Hollande
28. Who was conferred with the first Bhairon Singh Shekhawat Lifetime Achievement Honor in Public Service in May 2017?
1) Vasudhara Raje
2) Mamata Banerjee
3) Manik Sarkar
4) Pawan Kumar Chamling
5) Naveen Patnaik
29. Which private bank has launched a new trading platform called "Selfie" for its customers?
1) Yes Bank
2) Axis Bank
3) Federal Bank
4) Kotak Mahindra Bank
5) South Indian Bank
30. According to a recently released survey, which railway station is the dirtiest among 75 busiest stations in India?
1) Bhopal 2) Indore
3) Darbhanga 4) Beas
5) Jammu
31. Which of the following micro finance institutions became a commercial bank?
1) Disha 2) Janalakshmi
3) Ujjivan 4) Bandhan
5) Equitas
32. In which country is the International Criminal Court (ICC) located?
1) Italy 2) Netherlands
3) France 4) Switzerland
5) Russia
33. Which of the following regulates commodities market?
1) FCI 2) IRDAI
3) SEBI 4) RBI
5) PFRDA
34. Vinay Mohan Kwatra has been appointed as India's Ambassador to?
1) Russia 2) Germany
3) Ukraine 4) France
5) Spain
35. "SIMBEX-17" is the bilateral naval exercise between India and:
1) South Korea
2) Sudan 3) Singapore
4) Seychelles
5) Slovakia
36. Which football team won the prestigious I-League title in April 2017?
1) Mohan Bagan
2) Minerva Punjab
3) Aizawl 4) East Bengal
5) Shillong Lajong
37. Valtteri Bottas Won the Russian Formula One Grand Prix title recently. He belongs to?
1) Russia 2) Finland
3) Australia 4) Argentina
5) Germany
38. Who won the Italian Open tennis title in Rome in May 2017?
1) Novak Djokovic
2) Rafael Nadal
3) Dominic Thiem
4) Alexander Zverev
5) Carlos Moya
39. Who won the Reykjavik Open Chess tournament in Iceland in April 2017?
1) Anish Giri
2) Abhijeet Gupta
3) Gata Kamsky
4) John Pigott
5) None of these
40. Which Indian won the Women's title in the Asian Continental Blitz Chess championship in Chengdu, China in May 2017?
1) Padmini Rout
2) Dronavalli Harika
3) Mary Ann Gomes
4) R. Vaishali
5) Soumya Swaminathan

KEY

1) 3	2) 2	3) 3	4) 3
5) 4	6) 3	7) 2	8) 4
9) 3	10) 1	11) 2	12) 2
13) 3	14) 4	15) 3	16) 4
17) 1	18) 4	19) 3	20) 2
21) 1	22) 2	23) 3	24) 4
25) 2	26) 3	27) 2	28) 4
29) 3	30) 3	31) 4	32) 2
33) 3	34) 4	35) 3	36) 3
37) 2	38) 4	39) 1	40) 4

నీడను గుర్తించండి

పక్కన ఇచ్చిన 4 నీడల్లో రంగులలో ఉన్న కుందేలు నీడ ఏదో గుర్తించండి



గుర్తించండి

కింద ఇచ్చిన బొమ్మల పేర్లు పజిల్‌లో ఎక్కడ ఉన్నాయో గుర్తించండి

car	h	o	m	e	a	b
lip	m	y	p	p	r	q
worm	r	o	i	a	s	y
yoyo	o	y	l	n	s	u
home	w	o	t	d	u	i
panda	c	a	r	a	e	f

దారి కనుక్కోండి

మధ్యలో ఉన్న వంకాయ, ఉల్లిగడ్డ, బీరకాయ దగ్గరికి బయటి నుంచి టమాటా వెళ్లాలి. వెళ్లే దారి చూపండి.



నాన్నా చెప్పవా?

పేరుపెట్టి పిలిస్తే పందులు స్పందిస్తాయా?



మనుషులను పక్కన పెడితే, మిగతా జంతువులలోకి చింపాంజీలు చాలా తెలివైనవి. ఇక ఆ తరువాత మూడు స్థానాలనూ వరుసగా డాల్ఫిన్లు, ఏనుగులు, పందులు ఆక్రమిస్తాయి. అంటే తెలివైన జంతువుల్లో పందులది నాలుగో స్థానమన్న మాట. మనం పెంచుకునే జంతువులకు గాని, మనకు తరచూ ఎదురయ్యే జంతువులకిగానీ మనం ఏదన్నా పేరు పెట్టి పిలవడం మొదలుపెడితే దానిని అర్థం చేసుకోడానికి, అంటే అది 'తన పేరే' అని తెలుసుకోవడానికి ఒక్కో జంతువుకీ ఒక్కో సమయం పడుతుంది. ఆవులు, గేదెలు, మేకలు, ఎలుకలు, కుక్కలు, పిల్లులు, గుర్రాల వంటి ఎన్నో జంతువులు ...మనమేదైనా పేరు పెట్టి పిలిస్తే చక్కగా స్పందిస్తాయి. ఆఖరికి కొన్ని పక్షులు కూడా తమకుపెట్టిన పేరుని అర్థం చేసుకోగల్గుతాయి. అయితే దీనిని గుర్తించడానికి కొన్ని జంతువులు కేవలం కొన్ని వారాల సమయమే తీసుకుంటే మరికొన్ని జంతువులు కొన్ని నెలల సమయాన్ని తీసుకుంటాయి. అంతే తేడా. మనం పెంచుకునే పందికి గాని, రోజూ మన ఇంటి ముందు నుంచి పోయే పందికిగాని ఓ పేరుని పెట్టి పిలవడం మొదలు పెడితే కేవలం రెండు–మూడు వారాలలోనే దానికి ఆ విషయం అర్థమవుతుంది. మన పిలుపుకి, మాటలకి తగినట్లుగా అది స్పందించడం కూడా మొదలుపెడుతుంది. కుక్కలు తమ 'పేరుని' గుర్తించడానికి సాధారణంగా నెల రోజులకుపైగా సమయాన్ని తీసుకుంటాయి. వాటితో పోలిస్తే ఈ విషయంలో పందులు చాలా తెలివైనవని చెప్పవచ్చు. అన్నట్లు మనుషులకు ఎంతో అవసరమైన ఇన్సులిన్‌తో సహా, 40 రకాలకు పైగా మందుల తయారీకి పందులు ఉపయోగపడుతున్నాయి. ఆఖరికి, పాడైన మనిషి గుండె తాలూకు కవాటాలకు బదులుగా పందుల గుండె కవాటాలను అమర్చేందుకూ వీలవుతుంది.

మీకు తెలుసా?



మోటార్ సైకిల్ హెల్మెట్‌ను ఒక న్యూరోసర్జన్ కనుగొన్నాడు



ఇండోనేషియాలో నీలిరంగు లావాను వెదజల్లే అగ్నిపర్వతం ఉంది

హోండా 1949లో తన మొదటి మోటార్ సైకిల్‌ను ఉత్పత్తి చేసింది. 15 సంవత్సరాలకే ఉత్పత్తుల్లో ప్రపంచ నెం.1 స్థాయికి చేరుకుంది




కింది రెండు బొమ్మల మధ్య ఉన్న 6 తేడాలను గుర్తించండి





కనుక్కోండి

పక్కన ఉన్న బొమ్మల్లో ఒకేలా ఉన్న రెండు బొమ్మలను కనుక్కోండి.




రంగులు వేయండి





కింద ఇచ్చిన కోతి బొమ్మను పక్కన ఉన్న ఖాళీ గళ్లలో గీసి రంగులు వేయండి



బాక్సింగ్‌లో ఆంధ్ర కళాశాల విద్యార్థుల ప్రతిభ



రాష్ట్ర బాక్సింగ్ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

పెనుమంట్ర: పెనుమంట్రలోని ఆంధ్రా అసోషియేషన్ కళాశాలకు చెందిన విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ చూపారు. ఇటీవల ఏలూరులో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబర్చారు. వీరిలో అలాగే వారిలో ఆరు గురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి సంజీవరెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన పీవీ రామిరెడ్డి, వి. ప్రసాద్, వి.విజయకుమార్, కె.సురేష్ రెడ్డి, వి.సాయికృష్ణ, బి.కుషిల్‌సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు, తోటి విద్యార్థులు విజేతలను అభినందించారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు దేవరపల్లి విద్యార్థులు



చిత్తూరులో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఓపెన్ టోర్నమెంట్‌కు వెళ్లిన దేవరపల్లి క్రీడాకారులు

దేవరపల్లి: చిత్తూరు జిల్లా మదనపల్లిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ ఓపెన్ టోర్నమెంట్‌కు దేవరపల్లి భూపతిరాజు విద్యా సంస్థ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల 26న ప్రారంభమైన టోర్నమెంట్ సెప్టెంబర్ 2 వరకు జరగనుంది. టోర్నమెంట్‌లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.1,00,000 నగదు అందజేస్తారని విద్యాసంస్థ పీడీ కేవీడీవీ ప్రసాద్ తెలిపారు. బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాల, ఆనంద్ ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలకు చెందిన క్రీడాకారుల జట్టుకు మంగళవారం టోర్నమెంటు నిర్వాహకుల నుంచి ఆహ్వానం అందింది. క్రీడాకారులు కె.శ్రీనివాస్, ఎ.సురేష్‌బాబు, కె.రాజేష్ (కెప్టెన్), జె.అప్పి, పి.రాజు, ఆర్.దుర్గాప్రసాద్, ఏవీఎస్ ప్రసాద్ (గోల్‌కీపర్), కె.కృష్ణంరాజు, జె.ప్రసాద్, కె.సూరి, కె.సీతారామరాజు, ఎస్.దుర్గాప్రసాద్, ఎం.మోహన్‌కుమార్, ఆర్వీ రమణ, పి.వంశీకేశవ, ఎ.సతీష్‌బాబు, ఎ.సుజయ్‌బాబు జట్టులో ఉన్నారు. క్రీడాకారులు టోర్నమెంట్‌కు బయలుదేరి వెళ్లినట్లు పీడీ ప్రసాద్ తెలిపారు.

ఆన్‌లైన్ సేవల్లో ఏలూరుకు ఏడో ర్యాంకు

ఏలూరు (సెంట్రల్) : ప్రజలకు ఆన్‌లైన్ సర్వీసులు అందించడంలో రాష్ట్ర స్థాయిలో ఏలూరు నగర పాలక సంస్థకు ఏడో ర్యాంకు లభించింది. ప్రతి నెల రాష్ట్ర ప్రభుత్వం మునిసిపాలిటీలు, నగరపాలక సంస్థకు ర్యాంకులను విడుదల చేస్తున్నారు. పుర సేవ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించడంలో, ఆస్తి పన్నుల వసూళ్లు, అకౌంట్ల ఆడిట్, ప్రజలకు అందిస్తున్న సేవలకు నగర పాలక సంస్థల్లో మొదటి ర్యాంకు, స్టేట్ మునిసిపాలిటీల్లో 7వ ర్యాంకును సాధించినట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది.

రేపటి నుంచి మద్దిలో పవిత్రోత్సవాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్: గుర్వాయి గూడెం మద్ది ఆలయంలో గురువారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ చైర్మన్ ఇ.గంగరాజు, ఈఓ పి.విశ్వనాథరాజు తెలిపారు. 31న సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం కార్యక్రమాలతో పవిత్రోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 3తో ముగుస్తాయని తెలిపారు. అగ్ని పర్తిష్ట, వాస్తు పూజ, చతుర్వేదాధ్యయనం, ద్వాదశ సూక్త పారాయణ, సప్త కలశ స్థాపన, కుంభ పూజ, మహాశాంతి హోమం, నీరాజన మంత్ర పుష్పాలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. అలాగే ఆదివారం ఉదయం 8 గంటలకు పవిత్ర విసర్జన అనంతరం గణపతి నవరాత్రులు పూర్తయిన సందర్భంగా మహాగణపతి హోమం, మహా పూర్ణాహుతి, దీక్షా విసర్జన పండిత సత్కారం, విద్యార్థులకు పెన్నుల పంపిణీ ఉంటుందని వివరించారు. భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

ఉత్కంఠభరితంగా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్

హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

భీమవరం:

భీమవరం కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో కాస్మో క్లబ్‌లో నిర్వహిస్తున్న గోకరాజు రంగరాజు మెమోరియల్ 73వ సౌత్ జోన్ అంతర రాష్ట్ర బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు మూడో రోజు మంగళవారం ఉత్కంఠభరితంగా జరిగాయి. మెన్స్, ఉమెన్స్, సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో క్రీడాకారులు తలపడ్డారు. ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్‌తో పాటు పాండిచ్చేరి, కేరళ, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక జట్లు చాంపియన్ షిప్ కోసం హోరా హోరీగా పోటీ పడుతున్నాయి. విజేతల వివరాలను క్లబ్ సెక్రటరీ పి.కృష్ణబాబు ప్రకటించారు.

- ఈ పోటీల్లో మెన్స్ సింగిల్స్‌లో ఫస్ట్ రౌండ్‌లో పి.జస్వంత్ (పాండిచ్చేరీ)పై కె.సాయిచరణ్ (ఆంధ్రప్రదేశ్) విజయం సాధించాడు.
- ఉమెన్స్ సింగిల్స్‌లో ఫస్ట్ రౌండ్‌లో ఎ.అక్షిత (ఆంధ్రప్రదేశ్)పై ట్రిస్సా జాలీ (కేరళ) విజయం సాధించారు.
- మిక్స్‌డ్ డబుల్స్ సెమీ ఫైనల్స్‌లో కె.జగదీష్,ఎస్కె గౌస్ (ఆంధ్రప్రదేశ్) జోడీపై ఇ.మోహనరాజ్, జి.సెంతివేల్ (తమిళనాడు) జంట 21–17, 23–25 పాయింట్లతో విజయం సాధించారు.
- బాయ్స్ అండర్ 19 ఫస్ట్ రౌండ్‌లో పి.చంద్రగోపీనాథ్ (ఆంధ్రప్రదేశ్)పై పి.లోహిత్ (తెలంగాణ) 21–14, 21–7 తేడాతో గెలుపొందారు.
- గరల్స్ అండర్ 19 ఫస్ట్‌రౌండ్‌లో జి.మేఘన (ఆంధ్రప్రదేశ్)పై వి.వర్ష (21–19, 24–22 పాయింట్లతో విజయం సాధించారు.
- బాయ్స్ డబుల్స్ అండర్ 19 క్వార్టర్ ఫైనల్‌లో ఎ.విమల్‌రాజ్, ఆర్. విశ్వ (తమిళనాడు) జంటపై ఎ.వేదవ్యాససాయి, పి.చంద్రగోపీనాథ్ (ఆంధ్రప్రదేశ్) జంట 13–21, 21–19, 21–13 పాయింట్ల తేడాతో విజయం సాధించారు.
- గరల్స్ డబుల్స్ అండర్ 19 క్వార్టర్ ఫైనల్‌లో కె.వన్షిక, బి.సుప్రియ (తెలంగాణ) జంటపై పి.మేఘ, వై.ఆశ్రిత (ఆంధ్రప్రదేశ్) జంట 21–8, 21–17 తేడాది గెలుపొందారు.



బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో తలపడుతున్న జగదీష్, గౌస్



విజయం కోసం పోరాడుతున్న ఆంధ్రా క్రీడాకారిణి అక్షిత

పాఠశాలల్లో క్రీడా మైదానాలు తప్పనిసరి

డీఈఓ గంగాభవాని

తాడేపల్లిగూడెం (తాలూకా ఆఫీస్ సెంటర్) :

పాఠశాలల్లో క్రీడా మైదానాలను రూపొందించాల్సిన బాధ్యత హెచ్ఎంలదేనని డీఈఓ ఆర్ఎస్ గంగాభవాని చెప్పారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో క్రీడా మైదానాలు మంజూరైన తాడేపల్లిగూడెం, కొయ్యలగూడెం డివిజన్ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలతో సమావేశం జరిగింది. డీఐఈఓ కె.నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ గంగాభావానీ

గంగాభవానీ మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో ఉన్నత పాఠశాలలకు క్రీడా మైదానాలు మంజూరైనట్లు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులను అందులో భాగస్వామ్యం చేసి క్రీడా మైదానాలను తయారు చేయాల్సిందేన్నారు. వనం మనం కార్యక్రమంలో ప్రతి విద్యార్థికి 5 మొక్కలు చొప్పున పంపిణీ చేయాలని, వాటికి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. ఆ ఫొటోలను జియో ట్యాగింగ్ పెడుతున్నట్లు తెలిపారు. డీవైఈఓ కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ 6 నుంచి 9 వతరగతి వరకు విద్యార్థులకు రెమిడియల్ క్లాసులు, 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రతి రోజు నిర్వహించాలన్నారు. ఎంఈఓలు హనుమ, శ్రీనివాస్, శేషు, నర్శింహమూర్తి, శుభాకారరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఓ బొజ్జ గణపయ్యా..
కడుపు నిండా ఆరగించవయ్యా!



వరసిద్ధి వినాయకునికి భక్తులు నివేదించిన 158 రకాల ప్రసాదాలు

ఓ బొజ్జ గణపయ్యా .. నీ బొజ్జ నిండుగా.. మేం పెట్టే ఫలహారాలు ఆరగించి మాపై కరుణ చూపయ్యా.. అంటూ భక్తులు ఆ గణనాథుడికి 158 రకాల పిండి వంటలను నివేదన చేశారు. కామవరపు కోట చౌతనా సెంటర్‌లో వరసిద్ధి వినాయకుడి మంటపంలో మంగళవారం రాత్రి భక్తులు భారీ ఎత్తున పిండి వంటలను నివేదించారు. అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.. – కామవరపు కోట

మెరిట్ స్కాలర్‌షిప్పులకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్ఆర్ పేట) : రానున్న నవంబర్ 5న జరగబోయే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ఎస్ గంగాభవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష రాయడానికి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, వసతి సౌకర్యం లేని ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ విద్యార్థులు రూ. 50 చెల్లించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 18 చివరి తేది అని, చలానా కట్టడానికి చివరి తేది సెప్టెంబర్ 20 అని ఆమె వివరించారు. నామినల్ రోల్స్, చలానాలను ఆయా ప్రధానోపాధ్యాయులు జిల్లా విద్యాశాఖాధికారికి సెప్టెంబర్ 29లోపు సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఎస్ఈఏపీ. ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో సంప్రదించవచ్చన్నారు.

కళావల్లభుడు




హైదరాబాద్ అన్నమయ్యపురంలో అన్నమాచార్య కీర్తనలు ఆలపిస్తున్న డాక్టర్ రమేష్, కూచిపూడి నృత్యభంగిమ

- కళల పునరుజ్జీవనానికి కంకణబద్ధుడైన వైద్యుడు
- కూచిపూడి, సంగీతంలో రాణింపు
- దేశ, విదేశాల్లో ప్రదర్శనలు

ఏలూరు (ఆర్ఆర్ పేట) :

స్వతహాగా ఆయన వైద్యుడు. భారతీయ సంప్రదాయ కళలంటే ఆయనకు ప్రాణం. అయితే కళలకు రోజురోజుకూ ఆదరణ తగ్గిపోతుండడంతో పునరుజ్జీవనానికి తన ప్రయత్నం చేయాలని కంకణబద్ధుడయ్యారు. ఆయనే ఏలూరుకు చెందిన డాక్టర్ కనుమూరి రమేష్. కాకినాడలో పుట్టి పెరిగిన రమేష్‌బాబు 1986లో పాండిచ్చేరి జిప్‌మర్ విద్యాసంస్థలో ఎంబీబీఎస్ చేశారు. 1992లో బెనారస్ హిందూ యూనివర్సిటీ నుంచి ఎంఎస్ పట్టా పొందారు. అప్పటి నుంచి వైద్య వృత్తిలో ప్రవేశించిన రమేష్ ఏలూరులో 2000లో ప్రశాంతి హాస్పిటల్ నెలకొల్పి ఇక్కడి రోగులకు వైద్య సేవలు అందిస్తున్నారు.

సంగీతం, కూచిపూడిలో శిక్షణ


డాక్టర్ రమేష్ తల్లి రాజ్యలక్ష్మి ఆలిండియా రేడియో కళాకారిణి. ఆమె స్ఫూర్తితో చిన్నతనంలోనే సంగీతం, కూచిపూడి నృత్యాలు నేర్చుకోవడం ప్రారంభించిన రమేష్ విద్యాభ్యాసం కోసం వాటిని మధ్యలోనే ఆపివేయాల్సి వచ్చింది. కొన్నాళ్లు వైద్య వృత్తిని కొనసాగించిన అనంతరం ఆయనలోని కళాతృష్ణ మళ్లీ మేల్కొంది. నేటి సమాజంలో తల్లిదండ్రులకు భారతీయ కళల పట్ల చిన్నచూపు ఉండడం ఆయనకు నచ్చలేదు. వారిలో మార్పు తీసుకురావాలనే తపనతో సంగీతంలోనూ, నృత్యంలోనూ తిరిగి శిక్షణ పొందారు. వాటిని ప్రదర్శించి ఆయా కళలకు విస్తృత ప్రచారం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అంకిత భావంతో ఆయన చేసిన సాధనతో ఆయా అంశాల్లో మంచి ప్రావీణ్యం సాధించి దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చే స్థాయికి ఎదిగారు. దీని ద్వారా విదేశీయుల్లో కూడా భారతీయ కళల పట్ల ఆకర్షణ కలిగే విధంగా తనవంతు కృషి చేస్తున్నారు.

అవార్డులు, బిరుదులు

2015లో విశాఖపట్నంలోని వైశాఖి 8వ అఖిల భారత నృత్యోత్సవాల్లో ప్రదర్శన సందర్భంగా ఆ సంస్థ డాక్టర్ రమేష్‌ను యువ నాట్యశ్రీ అవార్డుతో సత్కరించింది. అదే ఏడాది హైదరాబాద్ నటరాజ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ నిర్వహించిన అఖిల భారత నృత్యోత్సవాల్లో చేసిన ప్రదర్శనలో నాట్యవేద అవార్డునిచ్చి సత్కరించారు.

ఎన్నో ప్రదర్శనలు

2012లో హైదరాబాద్ రవీంద్రభారతిలో కూచిపూడి నృత్య ప్రదర్శన, ఏలూరులో 2012, 2013 సంవత్సరాల్లో జరిగిన నృత్యోత్సవాల్లో ప్రదర్శనతో పలువురు కళారంగ ప్రముఖులు, ఆహూతులను ఆకట్టుకున్నారు. అప్పటి నుంచి తన ప్రదర్శనల పరంపరను కొనసాగిస్తూ 2013లో జరిగిన రాష్ట్రస్థాయి యూరాలజీ వైద్యుల సదస్సులో, 2014లో అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో శ్రీ మహాకాళేశ్వర మందిరంలో ప్రదర్శన ఇచ్చారు. అలాగే 2014లో బెంగుళూరు గురు రవిశంకర్ ఆశ్రమంలో జరిగిన దసరా ఉత్సవాల్లో ఆయన సమక్షంలో నృత్య ప్రదర్శన చేశారు. 2015లో రాంచీలో జరిగిన జాతీయ యూరాలజీ కాన్ఫరెన్స్‌లో కూడా నృత్య ప్రదర్శన చేసి వైద్య వృత్తి భారతీయ కళల అభ్యాసానికి, పోషణకు అడ్డంకి కాదనే సందేశాన్ని దేశ వ్యాప్తంగా ఉన్న వైద్యులకు అందించారు. గతేడాది ఢిల్లీలో జరిగిన ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల్లో ఆయన ప్రదర్శించిన కూచిపూడి నృత్యం దేశ విదేశాల నుంచి వచ్చిన అనేకమంది కళాకారులను అబ్బురపరిచింది. ఇవి కూచిపూడి నృత్యంలో ఆయనకున్న ప్రవేశానికి కొన్ని మచ్చుతునకలు కాగా సంగీతంలో కూడా ఆయన తనదైన ముద్ర వేశారు. ఇంగ్లండ్‌లోని బర్మింగ్‌హామ్‌లో జరిగిన వైద్యుల సదస్సులో తన సంగీతంతో అన్నమాచార్య కీర్తనలు ఆలపించి ఓలలాడించారు. హైదరాబాద్‌లో ప్రముఖ సంగీత కళాకారిణి శోభారాజ్ సమక్షంలో అన్నమయ్యపురంలో అన్నమాచార్యకీర్తనలు శ్రావ్యంగా ఆలపించి శోభారాజ్ ప్రశంసలు అందుకోవడం ఆయనకు మధురానుభూతిగా నిలిచింది. ఇటీవల పోలీస్ శాఖ నేర నిరోధానికి ప్రత్యేకంగా రూపొందించిన ఒక యాప్ ప్రచారం కోసం నిర్మించిన షార్ట్‌ఫిల్మ్‌లో నటించి నటనలో కూడా తన ఉనికిని చాటుకున్నారు.



డాక్టర్ రమేష్ ప్రదర్శించిన కూచిపూడి నృత్యంలోని భంగిమ

కళలను ప్రోత్సహించండి



భారతీయ సంప్రదాయ కళలకు విదేశాల్లో ఎంతోమంది అభిమానులున్నారు. మన కళలను నేర్చుకోవడానికి అనేకమంది విదేశీయులు భారతదేశం వస్తుంటే భారతీయులు మాత్రం పాశ్చాత్య మోజులో పడి మన కళలను విస్మరించడం బాధిస్తోంది. విదేశాల్లో స్థిరపడిన భారతీయులు కూడా మన సంగీతం, మన సంప్రదాయ నృత్యాలను వారి పిల్లలకు నేర్పుతుంటే ఇక్కడి వారు మాత్రం పాశ్చాత్య సంస్కృతి మోజులో వాటికి బానిసలుగా మారే ప్రమాదం ఏర్పడింది. వారిలో మార్పు తీసుకురావడం కోసమే చిన్న ప్రయత్నం చేస్తున్నా.

– డాక్టర్ కనుమూరి రమేష్, యూరాలజిస్ట్

నృత్యాంజలి



చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాల్లో వివిధ భంగిమలు






గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏలూరు రామచంద్రరావుపేట శ్రీమత్ మార్కండేయ వేద పాఠశాలలో మంగళవారం రాత్రి చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నగరానికి చెందిన నాట్యాచార్యులు గండికోట రాజేష్ శిష్యులు అన్నమాచార్య, త్యాగరాజ కీర్తనలకు నృత్యప్రదర్శనలు చేసి భక్తులను అలరించారు.

– ఏలూరు (ఆర్ఆర్ పేట)

అతిథులొచ్చాయ్



చోడవరంలో సందడి చేస్తున్న సైబీరియా పక్షులు

- చోడవరంలో విదేశీ విహంగాల సందడి
- దశాబ్దాలుగా క్రమం తప్పకుండా రాక
- సైబీరియా పక్షులను సంరక్షిస్తున్న గ్రామస్తులు

జిల్లాలో పురుడు పోసుకుంటాయ్.. రెక్కలు వచ్చాక ఎగిరిపోయి ఎక్కడెక్కడో పెరుగుతాయి.. సంతానోత్పత్తి కోసం మళ్లీ పుట్టింటికి వస్తాయి.. నాలుగైదు నెలల పాటు సందడి చేస్తాయి.. ఆ తర్వాత పిల్లలతో కలిసి రెక్కలు కట్టుకుని మళ్లీ ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతాయి. కొన్నేళ్లుగా సైబీరియా పక్షులు జిల్లాకు క్రమం తప్పక వస్తూ మనకు అతిథులుగా మారాయి. ఈ ఏడాది కూడా నల్లజర్ల మండలం చోడవరంకు అతిథులొచ్చి సందడి చేస్తున్నాయి.



నల్లజర్ల :

నల్లజర్ల మండలం చోడవరం గ్రామానికి ఏటా మాదిరిగానే సైబీరియా పక్షులు వచ్చాయి. దీంతో ఆ గ్రామంలో సందడి మొదలైంది. గ్రామస్తులు ఈ పక్షులను ఎంతో అపురూపంగా చూసుకుంటారు. పక్షులు గ్రామానికి వస్తున్నాయంటే వర్షాలు ప్రారంభం కాబోతున్నాయన్న సంకేతంగా ఇక్కడి వారు భావిస్తారు. జూలై చివరలో వచ్చిన ఈ పెలికాన్ పక్షులు చెట్లపై గూళ్లు కట్టుకొని గుడ్లు పెట్టి పొదిగి పిల్లలు పెద్దయ్యాక వాటితో కలిసి నవంబర్‌లో తిరుగు ప్రయాణమవుతాయి. ఈ క్రమంలో గ్రామంలో పక్షుల కిలకిలరావాలు గ్రామస్తులకు ఎంతో ఆనందాన్నిస్తాయి. జంటలుగా సంచరించడం, పక్షి పిల్లలకు ఆహారం తినిపించడం, నీరు తాగించడం, వాటికి ఎగరడం నేర్పించడం వంటి కనువిందైన సన్నివేశాలు గ్రామస్తులకు మానసికోల్లాసం కలిగిస్తుంటాయి. ఇది ఏన్నో ఏళ్లుగా జరుగుతుందని గ్రామస్తులు చెబుతున్నారు. వాటి రాక వల్ల తమ గ్రామం సుభిక్షంగా ఉంటుందని, పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని గ్రామస్తులు విశ్వసిస్తుంటారు. వీటిని ప్రత్యేక అతిథులుగా భావించిన గ్రామస్తులు సంరక్షణకు చొరవ చూపడంతో ప్రాణ హాని, భయం లేకుండా ఆహార అన్వేషణకు పరిసరాల్లో స్వేచ్ఛగా సంచరిస్తూ మరింత అలరిస్తున్నాయి.

పక్షులకు పుట్టిల్లు

విదేశీ పక్షులకు చోడవరం పుట్టిల్లుగా మారింది. మూడు దశాబ్దాలుగా ఇక్కడకు ఏటా క్రమం తప్పకుండా పక్షులు వస్తున్నాయి. చెట్లపై గూళ్లు కట్టుకున్న తర్వాత ఆడ, మగ పక్షులు ఒకదానితో ఒకటి తొక్కిళ్లు పడతాయి. ఇలా సంపర్కం తర్వాత 10–12 రోజులకు ఆడపక్షి రోజుకొకటి చొప్పున రెండు నుంచి నాలుగు గుడ్లు పెడుతుంది. ఆ తర్వాత గుడ్లపై కూర్చుని పొదుగుతుంది. ఆ కాలంలో మగపక్షి పొలాల్లోకి వెళ్లి నత్తలు, చిన్న చిన్న చేపలు, కీటకాలను తెచ్చి ఆడపక్షి నోట్లో జారవిడుస్తుంది. 21 రోజులకు గుడ్లు పగిలి పిల్లలు బయటకు వస్తాయి. ఆ తర్వాత ఆడ, మగ పక్షులు ఆహారాన్ని వేటాడి తెచ్చి పిల్లలకు పెడుతుంటాయి. చోడవరంలో నత్తగుల్లలు ఎక్కువగా ఉండటంతో వాటి ఆహారానికి కొదవ ఉండదు. ఏటా క్రమం తప్పకుండా రావడానికి ఇది కూడా ప్రధాన కారణం.



వన్యప్రాణి యాజమాన్య విభాగం ఏర్పాటు చేసిన బోర్డు

గ్రామస్తుల సంరక్షణ

విదేశీ పక్షులు గ్రామంలోకి రాగానే వీటి సంరక్షణ బాధ్యతలను గ్రామస్తులే చేపడతారు. గతంలో తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేగా పనిచేసిన అల్లూరి కృష్ణారావు స్వగ్రామం చోడవరం. ఎవరైనా పక్షులను వేటాడరని తెలిస్తే ఆయన పిలిచి కొరడాలతో కొట్టేవారని గ్రామస్తులు చెబుతారు. ఆనాటి నుంచే ఎవరైనా పక్షులను వేటాడినా గ్రామస్తులు జరిమానా విధిస్తారు. దీంతో వేటగాళ్లెవరూ ఈ పరిసర ప్రాంతాలకు రారు. వన్యప్రాణి విభాగం వారు కూడా పక్షుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. గ్రామంలో స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. పక్షుల ప్రేమికులు ఈ సైబీరియా పక్షులను తిలకించేందుకు గ్రామానికి వస్తారు.

పక్షులొస్తేనే వానలొస్తాయి



చిన్నతనం నుంచి ఈ పక్షులను చూస్తున్నాం. ఇవి వస్తేనే వానలొస్తాయని, పంటలు పండుతాయని మాకు నమ్మకం. వీటి రాక ఆలస్యమైతే ఆ ఏడాది వర్షాలు ఆలస్యమవుతూ ఉంటాయి. పక్షులకు ఎటువంటి హాని కలగకుండా గ్రామస్తులంతా చూస్తాం.

– అయినం నాగేశ్వరావు, పడమర చోడవరం

పర్యాటక ప్రదేశంగా గుర్తించాలి



సైబీరియా పక్షులు మా గ్రామానికి ఏటా వస్తాయి. ఏటా ఆరేడు మాసాలు ఇక్కడ సందడి చేస్తాయి. ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలి. కానీ ఇప్పటి వరకు అటువైపుగా ప్రభుత్వం ఆలోచించడం లేదు.

– కొత్తపల్లి రమేష్, పడమర చోడవరం